

డీఈవో బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వాసుదేవరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సంఘం నిర్దేశాల ప్రకారం జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఎస్.అబ్రహాం ఏలూరు జిల్లాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా ఉపవిద్యాశాఖాధికారి వాసుదేవరావును ప్రభుత్వం నియమించింది. కలెక్టర్ మాధవీలతను కలిసి మొక్కను అందజేశారు.



ఏర్పాట్లు పరిశీలిస్తున్న హర్షకుమార్ తదితరులు

రేపు దళిత సింహగర్జన సభ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9 : రాజమహేంద్రవరం జాతీయ రహదారి వేమగిరి వద్ద సుమారు 50 ఎకరాల్లో ఆదివారం నిర్వహించనున్న దళిత సింహగర్జన సభ ఏర్పాట్లు వేగవంతంగా చేస్తున్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి దళిత ప్రతినిధులతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భారీగా దళిత సంఘాల నాయకులు ఈ సభకు తరలివస్తారన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు దళిత సింహగర్జన సభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అణచివేత, 27 సంక్షేమ పథకాల రద్దు,దళితులపై జరిగిన మారణకాండ, దళిత విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం తదితర సమస్యలపై ప్రశ్నిస్తామన్నారు.ఈ సభ ద్వారా జగన్ ప్రభుత్వంపై యుద్ధం ప్రకటించబోతున్నారు.ఈ సభకు కాపునాడు రాష్ట్ర జేఏసీ, కోనసీమ కాపు జేఏసీ కూడా మద్దతు ప్రకటించింది. సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ జీవి హర్షకుమార్, తనయుడు జీవీ శ్రీరాజ్ , దళిత సంఘాల నేతలు పర్యవేక్షిస్తున్నారు. 25 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభా ఏర్పాట్లపై పోలీస్ నిఘా కూడా ఉంది.



ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ మాధవీలత

3,88,268 మంది చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంగా ఉంటే చదువుల్లోనూ బాగా రాణించవచ్చని పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పురస్కరించుకుని శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) పంపిణీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. స్కూల్ చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సున్న 3,78,949 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 3595 సంస్థల్లో మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 3,88,268 మంది పిల్లలకు గాను తొలిరోజు 98 శాతం లక్ష్యం సాధించామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్‌ఏటీవో డాక్టర్ ఎస్.వసుంధర, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.



అనపర్తిలో ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశ కార్యకర్తల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : చలో విజయవాడ సందర్భంగా ఆశ కార్యకర్తలపై జగన్ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధాన్ని విధించినందుకు నిరసనగా ఈ నెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బాయ్‌కట్ చేయడం జరిగిందని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పేర్కొన్నారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు.ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాజమహేంద్రవరం అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, హవేలా, మంగ, సత్య, కమల,సునీత, జయ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం శిరోముండనం బాధితురాలి
స్టేట్‌మెంట్ నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని శిరోముండనం కేసులో బాధితురాలు షేక్ ఆశాను శుక్రవారం సాయంత్రం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆమె స్టేట్‌మెంట్(164)ని నమోదు చేశారు. ఈ మేరకు జడ్జి ఎదుట ఆమె తన గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమైంది. న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం ఆమెను వసతి పొందుతున్న స్టేట్‌హోంకి పోలీసులు తరలించారు.





చాగల్లు రచ్చబండలో వినతులు స్వీకరించి.. సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ షర్మిలరెడ్డి

మాట నిలబెట్టుకోలేని జగన్..
వైఎస్ వారసుడు కాదు!

- జగన్ ఒక్క హామీని నెరవేర్చలేదు
- మద్యం నిషేధం అటకెక్కింది..
- సంక్షేమం పేరుతో సంపద దోపిడీ
- ఏపీ ప్రయోజనాలు బీజేపీకి తాకట్టు
- ప్రత్యేక హోదా ఏం చేశారు..
- హోం మంత్రి రాజీనామా చేయాలి
- చాగల్లు రచ్చబండలో షర్మిలరెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 9 : జగన్మోహనరెడ్డి ప్రభుత్వం సంక్షేమం పేరుతో మట్టి బిందే ఇచ్చి.. వెండి బిందె దోచుకుంటుందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి అన్నారు. ముందు వై.ఎస్ షర్మిలారెడ్డికి కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. నల్లజర్ల నుంచి పంగిడి, మీనానగరం మీదుగా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ సభకు చేరుకున్నారు. అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రచ్చబండ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.జగన్,చంద్రబాబులు ప్రత్యేక హోదా ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నించారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏం సహాయం చేసిందని అధికార, ప్రతిపక్షాలు పొత్తుల కోసం ఎగబడుతున్నారన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా, రాజధాని, ఇలా ఏపీ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్రాన్ని మోసం చేసిందన్నారు. గత పదేళ్లలో టీడీపీ, వైసీపీకి అధికారం ఇచ్చి మోసపోయారన్నారు.ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిజమైన ఉద్యమం చేయాలన్నారు. బీజేపీకి గులాంగిరి చేసే పార్టీలు నశించిపోవాలన్నారు.నా పుట్టింటికి మేలు చేయడానికి నేను సిద్ధం అన్నారు. రాష్ట్రంలో 60 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొవ్వూరు నియోజకవర్గంలో దళితులు హత్యలకు గురయ్యారన్నారు. హోంమంత్రి దళితురాలై ఉండి దళితులను కాపాడుకోలేకపోతే ఇంక పదవులు ఎందుకు అన్నారు. తక్షణం హోంమంత్రి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. పాదయాత్రలో జగనన్న ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికి అమ్మఒడి ఇస్తానని.. అధికారంలోకి వచ్చాక ఒకరికే ఇస్తున్నారన్నారు. ఫీజు రియంబర్స్‌మెంటు ఎత్తేశారు. చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదన్నారు. మద్యం పేరుతో సర్కార్ దోపిడీ చేస్తుందన్నారు. నాణ్యతలేని మద్యం తాగి లివర్ పాడై అనారోగాలకు గురవుతున్నారన్నారు. చాగల్లు జైపూర్ షుగర్స్ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు.

ఎవరేం మాట్లాడారంటే..


- మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్మోహనరెడ్డి రాజన్న రాజ్యం తీసుకొస్తానని చెప్పి అధికారం వచ్చిన తరువాత మట్టి, ఇసుక, మద్యం పేరుతో దోచుకుంటున్నారన్నారు. జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబరుకు 7 సార్లు ఫిర్యాదుచేసినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఇసుక అక్రమ డ్రెజ్జింగ్‌తో వంతెనల మనుగడ దెబ్బతింటుందన్నారు.హోంమంత్రి ప్రాతినిధ్యంవహిస్తున్న కొవ్వూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నిర్వీర్యం చేశారన్నారు.రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు.హోంమంత్రి నియోజకవర్గంలో ఉన్నామని చెప్పుకోవడానికి సిగ్గు పడుతున్నామన్నారు.
- కొవ్వూరుకు చెందిన ఆటోడ్రైవర్ పాటోలు రత్నప్రసాద్ మాట్లాడుతూ మా పాపకు ఏడాది వయసులో కింద పడి తలకు దెబ్బతగిలి బ్రెయిన్‌లో నరం దెబ్బతింది.కాలు, చెయ్యి పక్షవాతం వచ్చినట్లుగా తయారైంది.చికిత్స చేయించడానికే ఆర్థికభారం గా ఉంది. పింఛను అందించాలని స్వయంగా జగన్మోహనరెడ్డిని రెండు సార్లు కలిసి విన్నవించిన ఫలితం లేదు.
- సమగ్ర శిక్షా జేఏసీ నాయకుడు వెంకట్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్షా సిబ్బందిని రెగ్యులర్ చేస్తానని పాదయాత్రలో సీఎం జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్లగా పట్టించుకోలేదు.గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులు సమ్మె చేపట్టాం. ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపి సమ్మె విరమింపజేశారు.నెలరోజులు గడుస్తున్నా డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి సమాచారం లేదు.

ఒక్క హామీ నిలబెట్టుకోలేదన్నారు. మద్యపానం నిషేదం చేసి ఓటు అడుగుతామన్నారు. మద్యపాన నిషేధం ఎక్కడని ప్రశ్నించారు. మాట నిలబెట్టుకోలేని మీరెలా వైఎస్ఆర్ వారసులవుతారన్నారు. వైఎస్ఆర్ ఆశయాల సాధనకే నేను నా పుట్టింటికి వచ్చాను.. ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పోలవరం పూర్తవుతుంది. హోదా వస్తుంది, యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ రాష్ట్రలంలో దళితులపై దాడులు పెరిపోయాయని, ధరలు ఆకాశనంటుతున్నాయని, అంక్షల పేరుతో ఇళ్లస్థలాలు, పింఛన్లు తొలగిస్తున్నారన్నారు. ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగిపోవడంతో కౌలు రైతులు సాగు ఖర్చు పెరిగిపోయి తీవ్ర నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చాగల్లులో రచ్చ బండ ముగిసిన అనం తరం కొవ్వూరు యువరాజ్ కళ్యాణ మండపం చేరుకుని భోజన అనంతరం గామన్‌బ్రిడ్జి మీదు గా తుని బయలుదేరారు.ఈ కార్యక్రమంలో గిడుగు రుద్రరాజు, జేడీ.శీలం, ఎన్.రఘువీరారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, సుంకర పద్మశ్రీ, ముళ్ల మాధవ్, అమర్ జహా బేగ్ మహ్మద్, బాలేపల్లి మురళీధర్, డా. వడయార్, మార్టిన్ లూథర్, గంధం పూజ్య నరసింహ బాపూజీ, ఎం.డి రఫీయుల్లాబేగ్, చిన్నం మురళీ, సాయిన సుబ్బారావు, జొన్నకూటి రవి, ఆకుల భాగ్యలక్ష్మి, బండి భాస్కరరావు, గెడ్డం సాయిబాబా, కొణిదల శ్రీనివాస్, సాకా పుల్లారావు, బోడా వెంకట్, అంకంగోపి, కూరెళ్ల గంగరాజు, తాడాల కొండరాజు, జక్కంపూడి సత్తిబాబు, ముప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టినీ.. వదలరు



ఇలా కొల్లగొట్టేస్తున్నారు : పెరవలి మండలం కాకరపర్రులో లంకమట్టిని తవ్వుకుపోతున్న అక్రమార్కులు



- కన్నుపడితే ఖాళీయే
- లంకలను మింగేస్తున్నారు..
- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- అనుమతుల్లేకుండానే తవ్వకాలు
- పగలూ రాత్రీ ఇదే పని
- అయినా పట్టని అధికారగణం
- మామూళ్లే కారణమని ఆరోపణలు
- కాకరపర్రులో లారీల అడ్డగింత
- నేటికీ కేసు నమోదు కాని వైనం?

గోదారి లంకలను కొల్లగొడుతున్నారు..

పెరవలి,ఫిబ్రవరి 9 : ఇసుకే కాదు.. మట్టినీ వదలడం లేదు.. ఎక్కడ కనబడితే అక్కడే తవ్వేస్తున్నారు.. అయినా మాట్లాడేవారు లేరు.. కనీసం కన్నెత్తి చూసేవారే లేరు.. చెరువులే కాదండోయ్ చివరికి గోదావరిని వదలడంలేదు. ఏదైనా మాట్లాడితే అనుమతులు ఉన్నాయంటూ హడావుడి చేస్తున్నారు.. కాకరపర్రులో గురువారం రాత్రి జరిగిన సంఘటనే అందుకు నిదర్శనం.కాకరపర్రు గోదావరి నుంచి ప్రతి రోజూ వందలాది లారీల్లో మట్టిని యధేచ్ఛగా తరలించేస్తున్నారు.. వాహనాలు అటూ ఇటూ తిరగడం ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు మట్టి లారీలను అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ రంగంలోకి దిగి లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అయితే ఇంకా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. అధికారుల చర్యలు తూతూమంత్రంగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.

లంకలు ఖాళీ అయిపోతున్నాయ్..

పచ్చని పంట పొలాలతో కళకళలాడాల్సిన భూములు నిస్సారమై బీడు భూములను తలపించేలా ఉంటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా అంతా దాదాపు గోదావరి పరీవాహక ప్రాంతమే. తాళ్లపూడి మండలం నుంచి మొదలుకుని ధవళేశ్వరం, కడియం, పెరవలి వరకూ ఉంటుంది. దీంతో గోదావరి వరద కారణంగా ఎంతో మంది రైతులు భూములు కోల్పోయారు. గోదావరి పొడవునా గత 50 ఏళ్లలో వేలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోయాయి. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అదే వరద గోదావరి గత 50 ఏళ్లుగా వేలాది ఎకరాలను మెరక చేసింది.ఈ భూముల్లో పలువురు పట్టాలు గల రైతులు వివిధ పంటలు వేసి సాగు చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తుంది. వీటిని కూడా చిన్న చిన్న రైతులు పచ్చగడ్డి , కూరగాయలు వివిధ రకాల పంటలు పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం అక్రమార్కుల కన్ను గోదావరి లంక భూములపై పడింది. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఇటుకబట్టీలకు తరలించేస్తున్నారు. దీంతో వేలాది ఎకరాలు మాయమవుతున్నాయి. పట్టాలు పొందిన రైతులు సహకరిస్తుండడంతో అక్రమ మట్టి తోలకందారులకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. రెండు యూనిట్లు లారీ రూ.3 వేలు నుంచి రూ. 4 వేలకు విక్రయిస్తున్నారు. గోదావరి పొడవునా రాత్రి పగలు తేడా లేకుండా వందలాది లారీల మట్టి తరలించుకుపోతూ అక్రమార్కులు కోట్లలో సొమ్ములు కూడబెడు తున్నారు. ఆ భూములు కలిగి ఉన్న రైతులకు మాత్రం తృణమోపణమో అప్పజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ పట్టాలు కలిగి ఉన్న రైతులు ఆ మట్టి తీసిన భూముల్లో ఏమి పండక పైకి కిందకి చూస్తున్నారు. ఈ విధంగా కాకుండా తమకు పట్టాలిచ్చిన భూముల్లో వివిధ రకాలు పంటలు సాగు చేసి కుటుంబానికి తగ్గ ఆదాయం పొందవచ్చునని పలువురు రైతులు నిరూపిస్తున్నారు.

సాగు..బాగున్నా...

పెరవలి మండలం తీపర్రులో వందలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోయింది. అయినప్పటికి గత 30 ఏళ్లలో మళ్లీ మట్టి మెరక వేసి ఎవరి భూములు వారికి సాగులోకి వచ్చాయి. దీంతో ఆనందపడిన రైతులు భూములు సరిచేసుకుని స్వల్పకాలిక పంటలు పండిస్తూ మెరక భూములతో సమానంగా ఆదాయం పొందు తున్నారు. జూన్ నెలలో గోదావరి వరదలు వచ్చే సమయానికి ఆ భూములు ఖాళీ చేసి నవంబరు వరకు వదిలివేస్తారు. వరద తగ్గిన అనంతరం ఆ భూముల్లో మినుము, పెసర వంటి స్వల్ప కాలిక పంటలు వేస్తారు. మూడు నెలలో అవి కోసిన అనంతరం మళ్లీ మొక్కజొన్న పంట వేస్తారు. అదికూడా 4 నెలల్లో కోతకు వచ్చి గోదావరి వరదలు వచ్చే నాటికి రైతుకు ఎటువంటి నష్టం లేకుండా ఉంటుంది. ఈ విధానంతో రైతులకు అన్ని ఖర్చులు పోనూ ఎకరానికి రూ.50 వేల వరకు మిగులుతుంది. గోదారమ్మ ఒడిలో శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుండడంతో పలువురు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం అటువంటి రైతులను పోత్సహిస్తే లంకల్లో నిరూపయోగంగా ఉన్న వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయి.

రైతులకే పట్టాలివ్వాలి..

వరదొస్తే కొన్ని చోట్ల భూమి కోతకు గురవుతుంది. అదే వరద ప్రభావంతో మరికొన్ని చోట్ల ఇసుక మేటలు వేస్తుంది.అంతే కాకుండా మరికొన్ని చోట్ల మెత్తని సారవంతమైన మట్టిని మేటలు వేస్తుంది. గోదావరి వరద వల్ల ఎంత నష్టం సంభవిస్తుందో అంతకు మించి లాభాలు ఉంటాయి. అయితే స్వార్థపరులైనకొంత మంది ఇసుక మేటలను కొల్లగొట్టడమే కాకుండా సారవంతమైన మట్టిని తవ్వుకుపోతున్నారు.ప్రస్తుతం పెరవలి మండలంలో సమారు 10 గ్రామాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఉంది.. ఖండవల్లి, మల్లేశ్వరం, కాకరపర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న లంకల్లో ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పెరవలిలో మండలంలో మట్టికి చాలా డిమాండ్ ఉంటుంది. ఎందుకంటే ఇటుకబట్టీలన్నీ అక్కడే ఉంటాయి.గోదావరి మట్టిని ఆయా బట్టీలకు తరలించేస్తున్నట్టు సమాచారం. కొవ్వూరు మండలం చిడిపిలోనూ ఇదే పరిస్థితి ఉంది.తాళ్లపూడి మండలం బల్లిపాడులోనూ యథేచ్ఛగా మట్టిని తరలించేస్తున్నారు. ఇక్కడి నుంచి మట్టిని గోపాలపురంలోని ఇటుక బట్టీలకు తరలించేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా పట్టాలు పొంది సల్పకాలిక ప్రయోజనం కోసం ఆ భూముల్లో మట్టి అమ్ముకుంటున్న రైతులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అటువంటి వారి భూములు స్వాధీనం చేసుకుని పం టలు పండించుకునే రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు. మెరక ప్రాంతంలో భూములు ధరలు ఆకాశాన్ని అంటి ఎకరం రూ. 40 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతుండడంతో ఆసక్తి గల రైతులు వాటిని సాగు చేయకుండా లంక పొంతాల్లోని భూములపై మొగ్గు చూపుతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచి వ్యవసాయం పట్ల మొగ్గు చూపే రైతులకు ఆ భూములు ఇవ్వాలని గోదావరి పరీవాహక రైతాంగం కోరుతున్నారు.

సాగు చేసుకుంటేనే బాగు



సుమారు 40 ఏళ్ల కిందట 10 ఎకరాలు గోదావరిలో కలిసిపోయింది. కొంత కాలానికి 3 ఎకరాలు మెరవ వేసింది. దానిని సాగులో తెచ్చా.. పదేళ్లగా పంటలు పండిస్తున్నా.. గుమ్మడి, మినుము, మొక్కజొన్న వంటి స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నా.. ఎకరాకు రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంది. లంకభూములు మట్టి తవ్వకానికి ఎందుకు అమ్ముతున్నారో అర్థం కావడంలేదు.

- కరుటూరి శ్రీనివాసరావు, రైతు, తీపర్రు



తీపర్రు లంక భూముల్లో కళకళలాడుతున్న చేను

మార్చి 1 నుంచి జగనన్న పాలవెల్లువ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 9: జగనన్న పాల వెల్లువ పథకంలో పాల సేకరణ కార్యక్రమం వచ్చేనెల 1 నుంచి ప్రారంభమౌతుందని జేసీ తేజ్ భరత్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామసచివాయలం-1లో పాలసేకరణపై గ్రామ సచివాలయ వలంటీర్లకు శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేకరించిన పాలకు వెన్నశాతం, చిక్కదనం ఆధారంగా ధర చెల్లింపులు చేస్తామని తెలిపారు. జిల్లాలో చేయూత ,ఆసరా కింద ప్రయోజనం కలిగిన రైతులను గుర్తించి వారి వివరాలు జేవీపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో రూరల్ ఎంపిడివో డి.శ్రీనివాసరావు, మండల వెటర్నరీ డాక్టర్ సౌమ్య , వలంటీర్లు ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం, బియ్యం నిల్వ వివరాలు నమోదు చేయాలి

రాజమహేంద్రవరం రూరల్ ,ఫిబ్రవరి 9: ప్రభుత్వ నిర్ధేశాల ప్రకారం జిల్లా వ్యాపారులు, మిల్లర్ల వద్ద ఉన్న బియ్యం, ధాన్యము నిల్వల వివరాలు సంబంధిత పోర్టల్‌లో వారంరోజులలోగా నమోదు చేయాలని జేసీ తేజ్ భరత్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో ట్రేడర్సు, హోల్‌సేలర్స్ , రిటైలర్స్ ,బిగ్ చైన్ రిటైలర్లు ,మిల్లర్లుతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన మేరకు ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. హెచ్‌టీటీపీ://ఈ వితఈజీఓఐఎల్ఎస్.ఎన్ఐసి. ఇన్/రైస్/లాగిన్ .హెచ్‌టిఎమ్ఎల్ నందు ఏడు రోజులలోపు తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి విజయభాస్కర్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు సిహెచ్ బ్రహ్మాజీ, ఎబీఎస్ ప్రసాద్, కె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

16న బంద్ విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : ప్రధాని మోదీ విధానాలు దేశ ప్రజలకు ప్రమాదకరమని పలు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఫిబ్రవరి 16న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు,వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్మిక సంఘాల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు.మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాడులుగా మారాయన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కె.జోజి, టీఎన్‌టీయూసీ యర్రమోతు ధర్మరాజు, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండలరావు, ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

చొల్లంగి తీర్థానికి

పోటెత్తిన భక్తజనం

సంగమేశ్వరస్వామికి పూజలు

ఆకట్టుకున్న కోల సంబరం



పుణ్యస్నానాలు చేస్తున్న భక్తులు



కరప, ఫిబ్రవరి 9: పురాణ ప్రాశస్త్యం కలిగిన చొల్లంగి అమావాస్య తీర్థానికి భక్తులు పోటెత్తారు. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది భక్తులు కరపమండలం ఉప్పలంక శివారు మొండి గ్రామం విచ్చేసి సముద్ర తీరాన కొలువుదీరిన బాలాత్రిపురసుందరి సమేత సంగమేశ్వరస్వామిని దర్శించుకున్నారు. తెల్లవారుజాము నుంచి భక్తులు ఆలయానికి విచ్చేసి సముద్ర స్నానాలాచరించి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. చొల్లంగిలోని రాజరాజేశ్వరిదేవి సమేత సోమేశ్వరస్వామి, కాలభైరవస్వామి, సీతారామాంజనేయ స్వామివార్లను కూడా దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. కరప, తాళ్లరేవు, కాజులూరు తదితర మండలాల నుంచి వీరభద్రుని ప్రభలు, గరగలను భారీ ఊరేగింపుగా తీసుకువచ్చి స్వామివారి దర్శనం చేసుకున్నారు. అలాగే అప్పన్నెద్దులను కోల సంబరం పాటలు, నృత్యాలతో తోలుకువచ్చి సముద్ర స్నానాలు చేయించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు, దేవదాయశాఖ సిబ్బంది స్నానఘట్టాల వద్ద గజ ఈతగాళ్లను, వైద్యసేవల కోసం శిబిరాన్ని, తాగునీటి వసతి, అన్నదానం ఏర్పాటు చేశారు. కాకినాడ రూరల్ సీఐ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కరప, పెదపూడి, ఇంద్రపాలెం, గొల్లపాలెం, కాకినాడ పోలీస్‌స్టేషన్‌ల ఎస్‌ఐలు, సిబ్బంది బందోబస్తు నిర్వహించారు. భక్తుల రద్దీతో యానాం జాతీయ రహదారిపై ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా వాహనాల రాకపోకలను మళ్లించారు. జడ్పీ సీఈవో ఎ.శ్రీరామచంద్రమూర్తి, దేవదాయశాఖ డీసీ ఎం.విజయరాజు, ఎంపీడీవో కొంకి అప్పారావు, ఎంఎస్ఎన్ చారిటీస్ ఏసీ పి.బాబూరావు, ఎంపీపీ పెంకె శ్రీలక్ష్మిసత్తిబాబు, సర్పంచ్ బొమ్మిడి నయోమి సతీష్, కార్యదర్శి ఎస్‌కే నాగేంద్రకుమార్, ఎంపీటీసీ కాలాడి కామేశ్వరరావు తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

బ్రహ్మసమేథ్యం..భక్త జనసంద్రం



స్వామి దర్శనానికి క్యూలో నిల్చున్న జనం

కాట్రేనికోన, ఫిబ్రవరి 9: చొల్లంగి తీర్థానికి అధిక సంఖ్యలో భక్తులు గురువారం రాత్రికే బ్రహ్మసమేథ్యం చేరుకున్నారు. రాత్రి ఆలయం వద్ద సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించారు. సంతాన ప్రాప్తి కోసం మహిళలు ఆలయ ఆవరణలో నిద్రించారు. వేకువజామున భక్తులు సముద్రంలో స్నానాలాచరించారు. బ్రహ్మేశ్వరస్వామి, కాలభైరవుడు, వినాయకుడు, కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. పల్లం శ్రీకాల భైరవస్వామి అన్నసమారాధన కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం అన్నదానం నిర్వహించారు. నవభారత్ గ్రామీణాభివృద్ధి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో మజ్జిగ, పులిహోర పంపిణీ చేశారు. ముమ్మిడివరం ఎమ్మెల్యే పొన్నాడ వెంకటసతీష్‌కుమార్, వైసీపీ అధ్యక్షుడు నల్లా నరసింహమూర్తి, పల్లం సర్పంచ్ మల్లాడి బాబ్జి తదితరులు పాల్గొన్నారు.

రత్నగిరిపై అధికారుల బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరిస్తున్న విశ్వనాథరాజు

అన్నవరం, ఫిబ్రవరి 9: రీజనల్ జాయింట్ కమిషనర్ కేడర్ కలిగిన అన్నవరం దేవస్థానంలో ప్రస్తుతం అడిషనల్ కమిషనర్ రామచంద్రమోహన్ ఈవో బాధ్యతలు నిర్వహిస్తుండగా తాజాగా అన్నవరం దేవస్థానానికి డిప్యూటీ ఈవోగా డిప్యూటీ కమిషనర్ కేడర్ అధికారి ఎస్.చంద్రశేఖర్‌ను దేవదాయ శాఖ కమిషనర్ నియమించారు. తక్షణమే విధుల్లో జాయిన్ కావాలని ఆదేశించడంతో ఆయన హుటాహుటిన గురువారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. ఇక సహాయ కమిషనర్‌గా తలుపులమ్మ లోవ ఈవో పి. విశ్వనాథరాజును నియమించడంతో ఆయన శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. అన్నవరం దేవస్థానంలో పూర్తిస్థాయి సహాయ కమిషనర్‌గా, లోవ దేవస్థానం ఇన్‌చార్జి ఈవోగా విశ్వనాథరాజు బాధ్యతలు నిర్వహించనున్నారు. ముందుగా స్వామిని దర్శించుకుని ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా దేవస్థానం ఉద్యోగులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

డబ్బు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి..

బాలికపై లైంగిక దాడి.. ఇద్దరు వీఆర్వోలపై పోక్సో కేసు

మరో ముగ్గురిపైనా.. నిడదవోలులో ఘటన

నిడదవోలు, ఫిబ్రవరి 9: డబ్బులిస్తామని చెప్పి ఇద్దరు వీఆర్వోలు ఓ బాలికను శారీరకంగా అనుభవించిన ఘటనపై పోక్సో చట్టం కింద శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన బాలిక(14) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో తెలిసిన వారింటికి వచ్చింది. ఆ బాలికకు డబ్బులు ఆశచూపి నిడదవోలుకు చెందిన షేక్ అఖిలాండేశ్వరి, బండారి లలిత, దాడిశెట్టి దుర్గారావు అనేవారు వ్యభిచార కూపంలోకి దింపారు. ఈ క్రమంలో నిడదవోలు మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న పార్ల వెంకట్రావు, ఇంజేటి చిట్టిబాబుల వద్దకు గురువారం రాత్రి దుర్గారావు బేరం మాట్లాడి బాలికను పంపాడు. ఆ బాలికను వారిద్దరూ గురువారం రాత్రి శారీరకంగా అనుభవించారు. తర్వాత బాలికను స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లో దింపేందుకు వీఆర్వో చిట్టిబాబు వెళ్లాడు. అక్కడ ముందుగా మాట్లాడుకున్న మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో వీఆర్వో చిట్టిబాబుపై దుర్గారావు, మరికొంతమంది దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో బాలిక ఫిర్యాదు మేరకు ఆమెను వ్యభిచార కూపంలోకి దింపిన ముగ్గురు దళారులతోపాటు, అత్యాచారం చేసిన ఇద్దరు వీఆర్వోలపై పోలీసులు పోక్సో తదితర చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అలాగే తమపై దాడిచేసి, డబ్బు లాక్కొని.. కులం పేరిట దూషించారంటూ వీఆర్వో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దుర్గారావుతోపాటు మరికొంతమందిపె కేసులు నమోదైనట్లు నిడదవోలు ఎస్‌ఐ పులపా అప్పారావు తెలిపారు.

గోడల మధ్య ఇరుక్కుని వ్యక్తి మృతి



యానాం, ఫిబ్రవరి 9: రెండు గోడల మధ్య ఇరుక్కుని ఓ వ్యక్తి మృతిచెందాడు. యానాం చింతావారి వీధికి చెందిన గీదా శివ సుబ్రహ్మణ్యం(38) తన గోడకు అనుకుని ఉన్న మరో గోడ మధ్యలో ఇరుక్కుని మృతిచెందాడు. అయితే శివకు ఇతర కుటుంబ సభ్యులు ఉన్నప్పటికీ ఇంట్లో ఒక్కడే ఉంటాడు. తరచూ మద్యం మత్తులో ఉంటాడు. ఈ నేపథ్యంలో మద్యం మత్తులో గోడపై కూర్చుని పడిపోయి ఇరుక్కుని ఉండవచ్చునని భావిస్తున్నారు. అయితే ఈ సంఘటన అర్ధరాత్రి 1 గంట నుంచి 2 గంటల మధ్యలో జరిగి ఉండవచ్చునని భావిస్తున్నారు. ఇరుగుపొరుగు వారు గమనించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అతి కష్టం మీద మృతదేహాన్ని బయటకు తీశారు. అనంతరం పోస్టుమార్టం నిమిత్తం యానాం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ విఫలం

రచ్చబండ కార్యక్రమంలో పాల్గొన్న పీసీసీ చీఫ్ వైఎస్ షర్మిల



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిల

చాగల్లు, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. చాగల్లులో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి ఆమె విచ్చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాశం స్వాతి సహా పలువురు మహిళలు మాట్లాడుతూ ఇళ్ల స్థలం లేదని, వైసీపీ నాయకులు వారికి కావలసిన వారికి మాత్రమే స్థలాలు ఇస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిరుద్యోగి కార్తీక్ మాట్లాడుతూ జాబ్ క్యాలెండర్ అన్నారు కాని ఇంతవరకు నోటిఫికేషన్లు విడుదల కాకపోవడం వల్ల అర్హతకు సంబంధం లేని పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు సంఘం సభ్యులు జీవీ సుబ్బారావు, కంకటాల బుద్ధుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తానని, రైతులను, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం జగన్, స్థానిక ప్రజాప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. రాళ్లముడుగు కాలువ వంతెనను వెడల్పు చేయాలని, కాలువ పూడిక తీయాలని కోరారు. లారీ అసోసియేషన్ తరుపున పంగిడికి చెందిన పెదకాపు, ఎం.నాని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రావాలని ఎంతో చేశామని కాని ప్రభుత్వం ట్రాన్సుపోర్టు రంగంపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐదు లారీలను నడిపేవాళ్లమని, ప్రస్తుతం ఒక్కలారీ కూడా నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. లారీ యజమానులకు, డ్రైవర్‌లకు ప్రమాద బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నామన్నారు. దళిత సంఘం నాయకుడు చోళ్ల రాజు మాట్లాడుతూ దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్న వారికి ఉన్నత పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దివ్యాంగుల సంఘం తరపున కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పింఛను సొమ్ము పెంచలేదని, వివిధ కారణాలు చూపిస్తూ రాష్ట్రంలో 96000 మంది పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. హోం మంత్రి సొంత నియోజకవర్గంలో జరుగుతున్న దాడులను ఆపలేని మంత్రి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పింఛన్లు పెంచాలని, రద్దు చేసిన వాటిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, ఉభయ గోదావరి జిల్లాల పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ, మండలాధ్యక్షుడు బి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, పి.మురళీకృష్ణ, ఎండీ అమర్‌జహబేగ్, ఎండీ రఫీయుల్లా బేగ్, గెల్లా భాస్కరరావు, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు.

మోసం చేయడానికే జగన్ 'సిద్ధం'

రాష్ట్ర ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి

రాష్ట్రానికి ప్రత్యేక హోదా కాంగ్రెస్‌తోనే సాధ్యం

జగన్ అధికారంలో ఉండి ప్రజలకు ఏం చేశారు

తునిలో ప్రభుత్వంపై ధ్వజమెత్తిన పీసీసీ అధ్యక్షురాలు షర్మిల



ప్రజలకు అభివాదం చేస్తున్న షర్మిల

తుని రూరల్, ఫిబ్రవరి 9: తునిలో పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి వైసీపీ ప్రభుత్వం జగన్ పాలనపై ధ్వజమెత్తారు. తుని నియోజకవర్గ కేంద్రమైన తుని పట్టణంలో రోడ్‌షో, బహిరంగ సభలో పాల్గొన్నారు. జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, తుని నియోజకవర్గ ఇన్‌చార్జ్ చిలుకోటి పాండురంగారావు ఆధ్వర్యంలో జిల్లా కాంగ్రెస్ శ్రేణులు, తుని ప్రజలు షర్మిలకు గజమాలతో స్వాగతం పలికారు. అనంతరం గొల్ల అప్పారావు సెంటర్‌కు చేరుకుని అక్కడ జరిగిన సభలో పీసీసీ అధ్యక్షురాలు షర్మిల మాట్లాడారు. అమలు కాని హామీల కోసం మాట్లాడకుండా ముఖ్యమంత్రి ఇప్పుడు సిద్ధమంటూ ముందుకు వస్తున్నారన్నారు. దేనికి సిద్ధమో చెప్పాలని నిరుద్యోగులను మోసగించడానికి సిద్ధమా, పోలవరం పక్కన పెట్టడానికి సిద్ధమా, రాష్ట్రాన్ని అప్పులకుప్పగా మార్చేసినందుకు సిద్ధమా అని అన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చాక ప్రత్యేక హోదా ఊసే మరిచిందని ప్రతిపక్ష నేత చంద్రబాబు, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి దొందూ దొందే అంటూ ఎద్దేవా చేశారు. నాడు చంద్రబాబునాయుడు ప్రభుత్వం 7 వేల డీఎస్సీ పోస్టులకు నోటిఫికేషన్ ఇస్తుంటే తాను అధికారంలోకి వస్తే 25 వేలు పోస్టులు భర్తీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. నిరుద్యోగులను నాలుగున్నరేళ్లు గాలిలో ఉంచి ఎన్నికల వేళ మెగా డీఎస్సీ కాస్త దగా డీఎస్సీగా మార్చి నోటిఫికేషన్ ఇచ్చారన్నారు.

రైతుల సమస్యలపై చిత్తశుద్ధి ఏదీ

దివంగత నేత రాజశేఖరరెడ్డి హయాంలో వ్యవసాయం పండగలా ఉండేదని రైతు రాజై ఉన్నాడన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీ, గిట్టుబాటు ధరలు, పంటనష్ట పరిహారం ఉండేదని, ఇప్పుడు నష్టపోయిన రైతులను పట్టించుకున్న వారే లేరని అన్నారు. మద్యపానాన్ని పూర్తిగా నిషేధిస్తానని నిషేధించిన తర్వాతే ఓట్లు అడుగుతానని జగన్ ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వమే నిస్సిగ్గుగా లిక్కర్ వ్యాపారం నిర్వహిస్తూ కల్తీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందన్నారు.

మంత్రి రాజా కాదు అనుభవించు రాజా

తునిలో జరిగిన సభలో స్థానిక మంత్రి రోడ్లు భవనాల శాఖా మంత్రి దాడిశెట్టి రాజాపై షర్మిల తీవ్రంగా విమర్శలు చేశారు. పేరుకే రోడ్లు భవనాల శాఖా మంత్రి అని రోడ్ల పరిస్థితి దయనీయంగా ఉంటుందని విమర్శించారు. మంత్రి ఇతర రాష్ట్రాల మద్యాన్ని తెప్పించి వ్యాపారం చేస్తున్నారని, ఇసుక మాఫియా, గుట్కా వ్యాపారాలు దగ్గరుండి నడిపిస్తున్నారని విమర్శించారు. మంత్రి పేరు దాడిశెట్టి రాజా కాదని, అనుభవించు రాజా అని ఎద్దేవా చేశారు. ఒకప్పుడు దివంగత నేత రాజశేఖరరెడ్డి హామీ మేరకు తునిలో భారీ ఫ్లై ఓవర్ నిర్మాణం జరిగిందని, ముంపునకు గురవుతున్న తాండవ నది రిటైనింగ్ వాల్ సమస్య దివంగత నేత రాజశేఖర్‌రెడ్డి ఉండి ఉంటే పూర్తయ్యేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం నియోజకవర్గ సమస్యలపై ఇచ్చిన హామీలు పెడచెవిన పెట్టిందని బంగాళాఖాతంలో కలిపేస్తానన్న దివీస్ పరిశ్రమను ఇప్పుడు దగ్గరుండి ప్రోత్సహిస్తోందని, తాండవ రిటైనింగ్ వాల్ ఊసే మరిచిందంటూ విమర్శించారు.

స్టేట్‌బ్యాంకు చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం



గ్యాస్ కట్టర్‌తో లాకర్ల ధ్వంసం

ప్రత్తిపాడు, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఉత్తరకంచి గ్రామంలో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా బ్రాంచ్‌లో చోరీ ఘటనపై దర్యాప్తు ముమ్మరం చేశారు. ఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు ఈ చోరీ ఘటనపై గాలింపులు చేపట్టారు. అలాగే ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ సురేష్‌బాబు శుక్రవారం ఉత్తరకంచి ఎస్‌బీఐ బ్యాంకుకు విచ్చేసి విచారణ చేపట్టారు. బ్యాంకులోని స్ట్రాంగ్ రూం లాకర్‌ను గ్యాస్ కట్టర్‌తో తెరిచిన వైనాన్ని ఆయన పరిశీలించారు. అలాగే బంగారం, నగదు ఏ మేరకు చోరీకి గురైందనే దానిపై బ్రాంచ్ మేనేజర్ కె. అశోక్ నాయక్, సిబ్బందిని ఆరా తీశారు. ఈ ఘటనలో ప్రధానంగా ఆరుగురు దుండగులు ఈ ఘటనకు పాల్పడినట్లు అనుమానిస్తున్నారు. బ్యాంక్ చోరీకి పాల్పడే ముందు రెక్కీ కూడా నిర్వహించి చోరీకి పాల్పడినట్లు భావిస్తున్నారు. గ్యాస్ సిలిండర్ వంటి సామగ్రితో చోరీకి పాల్పడి నలుగురు నిందితులు బయటకు సిలిండర్‌తో వెళుతున్న సీసీ పుటేజ్ దృశ్యాలు విడుదల చేశారు. చోరీకి పాల్పడిన ముఠా కారులో వచ్చిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో దొరికాయి. ఈ చోరీకి పాల్పడిన దొంగల ముఠా అంతరాష్ట్ర దొంగల ముఠా నేరస్తులుగా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉత్తరకంచిలో చోరీకి పాల్పడిన నిందితుల కారు తెలంగాణలోని భద్రాచలంలో కనిపించినట్లు తెలిసింది. ఈ చోరీలో దొంగలు తెరిచిన రెండు లాకర్లలో రూ.27లక్షల నగదు, 25 బ్యాగుల్లో రూ.48 లక్షలు విలువ చేసే బంగారు ఆభరణాలు ఉన్నట్లు సమాచారం. శుక్రవారం బ్యాంక్ లావాదేవీలు నిలిచిపోయాయి. చోరీకి పాల్పడిన దుండగులు లోపల వైర్లు కట్ చేయడంతో సర్వర్‌లు పని చేయకపోవడంతో లావాదేవీలు జరగడానికి వీలు లేకుండా పోయింది. శని, ఆదివారాల్లో సర్వర్లు, ఇతర సాంకేతిక సమస్యలు పరిష్కరించి సోమవారం నుంచి బ్యాంకు లావాదేవీలు పునరుద్ధరించేలా బ్యాంకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. బ్యాంకు లాకర్లలోని పెద్ద లాకర్ జోలికి దుండగులు వెళ్లకపోవడం వల్ల దాదాపుగా రూ.13 కోట్లు విలువైన బంగారు ఆభరణాలు దొంగల బారిన పడకుండా బయటపడ్డాయనే వాదనలు కూడా వినిపిస్తున్నాయి. భారీ మొత్తంలో నగదు, ఆభరణాల చోరీకి గురవడంతో ఉత్తరకంచి బ్యాంక్ పరిధిలోని ఖాతాదారులు ఆందోళనకు గురవుతున్నారు. తాము భద్రపరుచుకున్న బంగారు ఆభరణాల పరిస్థితి ఏంటని బ్యాంక్ అధికారులను ఆరాతీయగా 10 రోజుల వరకు ఏమీ చెప్పలేమని బ్యాంక్ అధికారులు అంటున్నారు.

అధిక సంఖ్యలో మొబైల్ ఫోన్ల రికవరీ

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ శ్రీధర్



వివరాలు వెల్లడిస్తున్న పోలీసు అధికారులు

అమలాపురం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): చాట్‌బాట్ సేవలను ప్రారంభించిన తర్వాత జిల్లాలో అత్యధికంగా మొబైల్ సెల్‌ఫోన్లను రికవరీ చేసినట్లు అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్.శ్రీధర్ తెలిపారు. అమలాపురం పోలీసు క్వార్టర్స్ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చాట్‌బాట్‌లో భాగంగా ఐదో విడతగా రూ.26.62 లక్షల విలువైన 170 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. గత ఏడాది ఫిబ్రవరి 8న జిల్లాలో చాట్‌బాట్ సేవలను ప్రారంభించగా ఇప్పటి వరకు రూ.1.08 కోట్ల విలువైన 674 మొబైల్ ఫోన్లను రికవరీ చేసినట్టు ఎస్పీ తెలిపారు. చోరీకి గురైన మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు ఎస్పీ శ్రీధర్ అందజేశారు. సెల్‌ఫోన్లు రికవరీ చేయడంలో విశేషంగా కృషి చేసిన అడిషనల్ ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా, క్రైమ్ సీఐ అబ్దుల్ సలాం, ఎస్‌ఐ ఎన్ఆర్ కిశోర్‌బాబు, ఏఎస్‌ఐ అయితాబత్తుల బాలకృష్ణ, హెచ్‌సీలు ఎంసీహెచ్ శేఖర్‌రాజు, కె.నాగేశ్వరరావు, కేవీ రమణ, ఎంవీ శ్రీనివాసరావు, కానిస్టేబుళ్లు ఎల్.శ్రీను, జి.కృష్ణసాయి, ఎం.హరిబాబు, బీడీవీ ప్రసాద్, డి.అర్జునరావు, ఎ.సుభాకర్, ఆర్ఎస్‌సీహెచ్‌వీఎన్ ప్రసాద్, కె.సతీష్‌లను ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.

త్రుటిలో తప్పిన ప్రమాదం



అమలాపురం టౌన్, ఫిబ్రవరి 9: అమలాపురం మెయిన్ రోడ్డులోని కెనరా బ్యాంకు ఎదుట తెల్లవారుజామున 108 అంబులెన్సు వాహనం మితిమీరిన వేగంతో వచ్చి ట్రక్కు ఆటోను ఢీకొంది. ప్రమాదం ధాటికి విద్యుత్ స్తంభం సైతం విరిగి వాహనంపై పడింది. ఈ ప్రమాదంలో ఆటో నేరుగా కెనరా బ్యాంకు మెట్ల పైకి వెళ్లిపోయింది. ట్రక్కు ఆటోలో ఉన్న డ్రైవర్ జనుపల్లికి చెందిన ఏవీవీ సత్యనారాయణకు గాయాలు కాగా ఆసుపత్రికి తరలించారు. అంబులెన్సు డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు.

విరాళాల వివరాలు ఇవ్వండి..

ద్రాక్షారామ ఈవోను ప్రశ్నించిన వైసీపీ నాయకులు, భక్తులు



ఈవోను ప్రశ్నిస్తున్న నాయకులు

ద్రాక్షారామ, ఫిబ్రవరి 9: ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి రథ నిర్మాణానికి సంబంధించిన ఖర్చుకు సంబంధించి అలాగే విరాళాల వివరాలు ఇవ్వాలని వైసీపీ నాయకులు, భక్తులు ఈవో పి.టి.వి సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భీమేశ్వరస్వామివారి దేవస్థానం కార్యాలయానికి వైసీపీ నాయకులు దొంగ శ్రీధర్, అనిశెట్టి చంటి, వాసంశెట్టి సూరిబాబు, భక్తులు చక్కా సోమరాజు తదితరులు చేరుకుని ఈవోను స్వామివారి రథం నిర్మాణం, పూల డెకరేషన్‌కు లక్షలు ఖర్చు చేయడం, లక్షల రూపాయలతో డ్రైఫ్రూట్స్ కొనుగోలు చేయడంపై ప్రశ్నించారు. స్వామివారికి టీటీడీ సమర్పించిన వస్త్రాలు ఏమయ్యాయని నిలదీశారు. రూ.90 లక్షలతో స్వామివారి రథం నిర్మాణం మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ చేయించినట్లు చెప్పారని అలా అయితే భక్తుల నుంచి వసూలు చేసిన లక్షల రూపాయల విరాళాలు ఏమయ్యాయని ఈవోను ప్రశ్నించారు. దాతగా మంత్రి పేరుతో శిలాఫలకం వేయించారని, విరాళాలు ఇచ్చిన దాతల పేర్లు శిలాఫలకంపై ఎందుకు వేయలేదని ప్రశ్నించారు.

అపోహతో ఆరోపణలు చేస్తున్నారు: ఈవో

కాగా ఈ విషయంపై ఈవో పి.టి.వి సత్యనారాయణ మాట్లాడుతూ రథం విషయంలో అక్రమాలు జరిగాయని అపోహతో ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. ఇప్పటి వరకు స్వామివారి రథం నిర్మాణానికి రూ.90 లక్షలు మంత్రి, అర్చకుల ద్వారా పెట్టుబడులు పెట్టినట్లు చెప్పారు. మంత్రి స్వయంగా రూ.30 లక్షలతో కలప కొనుగోలు చేశారని, అర్చకులు సహకారంతో భక్తుల నుంచి రూ.28 లక్షలు విరాళాలు సేకరించి రథం నిర్మాణానికి ఇచ్చినట్లు చెప్పారు. రథం నిర్మాణం మంత్రి వేణు సహకారంతో జరిగిందని ఆయన పేరుతో చిన్నపాటి శిలా ఫలకం వేయించామని, ఇతర దాతల పేర్లు పురావస్తుశాఖ అనుమతి ఇచ్చిన అనంతరం శిలాఫలకం వేయిస్తామని తెలిపారు.

సచివాలయ ఉద్యోగులపై దాడి

పిఠాపురం, ఫిబ్రవరి 9: కాకినాడ జిల్లా పిఠాపురంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల 11వ వార్డు సచివాలయ ఉద్యోగులపై శుక్రవారం దాడి జరిగింది. సచివాలయంలో కొన్ని రోజులుగా ఇళ్ల స్థలాల రిజిస్ట్రేషన్ జరుగుతోంది. సర్వర్‌లో తలెత్తుతున్న సమస్యలతో రిజిస్ట్రేషన్ ప్రక్రియలో తీవ్ర జాప్యం చోటుచేసుకుంటోంది. ఉదయం నుంచి వేచి ఉన్నామని, ఇంకెంత సమయం పడుతుందంటూ కాలనీకి చెందిన దండం గంగాభవానీ అనే మహిళ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ రామప్రసాద్‌పై ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ సమయంలో సచివాలయ మహిళా పోలీసు సంధ్యారాణి ఆ మహిళను మందలించి సర్దిచెప్పే ప్రయత్నం చేసింది. దీనితో గంగాభవానీ, మరోమహిళ, గంగాభవానీ బంధువు వచ్చి సచివాలయ ఉద్యోగులపై దాడికి పాల్పడ్డారు. ఇరువురి మధ్య తోపులాట జరిగింది. దీంతో వారికి గాయాలయ్యాయి. సచివాలయ ఉద్యోగులు పిఠాపురం పట్టణ పోలీసుస్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేశారు. పట్టణంలోని వివిధ వార్డు సచివాలయ ఉద్యోగులు వచ్చి సంఘీభావం తెలిపారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం

అన్నవరం, ఫిబ్రవరి 9: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం బెంగళూరుకు చెందిన కేపీ నాయుడు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ మొత్తాన్ని ఆయన దేవస్థానం ఏపీఆర్వో ఎం.గణపతిరావుకు అందజేయగా ఆయన దాతను అభినందించి దాతకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి వారి ప్రసాదాలు అందించారు.

పోక్సో కేసులో రెండున్నరేళ్ల జైలు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులోని నేరస్తుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 26న ఓ బాలిక కిరాణా దుకాణానికి వెళ్లగా అదే సమయంలో అక్కడ ఉన్న బొమ్మూరుకు చెందిన కె.సుధీర్ కుమార్(సిద్దు) తన బైక్‌పైకి ఆ బాలికను బలవంతంగా లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో బొమ్మూరు పీఎస్‌లోని అప్పటి ఎస్‌ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పితాని శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, అప్పటి ఎస్‌ఐ శివాజీ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు.

పది కిలోల గంజాయి పట్టివేత

మోతుగూడెం, ఫిబ్రవరి 9: చింతూరు మండలం మోతుగూడెంలో పోలీస్‌స్టేషన్ వద్ద పోలీసులు వాహనాలు తనిఖీ చేస్తుండగా సీలేరు నుంచి ద్విచక్ర వాహనం మీద హైదరాబాద్ వివేకానగర్‌కు పది కిలోల గంజాయి తీసుకు వెళ్తున్న కల్యాణ్‌కుమార్, నరేంద్రలను పోలీసులు పట్టుకున్నారు. గంజాయి విలువ సుమారు రూ.50 వేలు ఉంటుందని ఎస్‌ఐ జి.గోపాలరావు తెలిపారు. ఎస్‌ఐ వెంట హెడ్ కానిస్టేబుల్, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

ఆదివాసీ సంస్కృతిని పరిరక్షించుకోవాలి

చింతూరులో రేల పండుం

ఆకట్టుకున్న నృత్యాలు



మాట్లాడుతున్న సున్నం వెంకటరమణ

చింతూరు, ఫిబ్రవరి 9: కాలక్రమంలో మరుగునపడుతున్న ఆదివాసీ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకునేందుకు ఆదివాసీ సంక్షేమ పరిషత్ ఆధ్వర్యంలో 2013 నుంచి రేల పండుంని నిర్వహిస్తున్నట్లు ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సున్నం వెంకటరమణ చెప్పారు. చింతూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన జపాల్ సింగ్ ముండా కళా వేదికపై ముఖ్య అతిథిగా పాల్గొన్న సున్నం వెంకటరమణ మాట్లాడారు. ఐదో జాతీయ సాంస్కృతిక సంప్రదాయ సమ్మేళనం ఆదివాసీలు నిర్వహించుకోవడం, ఆ మేరకు వివిధ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ కళాకారులు పాల్గొని సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించడం అభినందనీయమన్నారు. ప్రాశ్చాత్య నాగరికత గుండంలో ఆదివాసీ సంస్కృతి సంప్రదాయాలు కొట్టుకుపోకుండా ఉండేందుకు, రానున్న ఆదివాసీ తరానికి ఆదివాసీ సంస్కృతిని గుర్తుచేయడమే ప్రధాన లక్ష్యంగా ఐదో రేల పండుంని నిర్వహిస్తుండడం సంతోషకరమన్నారు. ముందుగా ఆదివాసీ పెద్దలు పాల్గొని ఆదివాసీ నాయకుల చిత్రపటాలకు పూల దండలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం గ్రామ పెద్దలు సంప్రదాయ పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం ఆదివాసీ జెండాను ఆవిష్కరించి కార్యక్రమాలను ప్రారంభించారు. ఒడిసా, అసోం, తమిళనాడు, ఝార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన ఆదివాసీ కళాకారులు పాల్గొని వారి వారి ప్రాంతాల ఆదివాసీ సంప్రదాయ నృత్యాలు ప్రదర్శించారు.

ఏజెన్సీ సమాచారం

పోలింగ్ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అధికారులతో సమావేశమైన కలెక్టర్ సుమిత్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

రంపచోడవరం, ఫిబ్రవరి 9: పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ అన్నారు. ఐటీడీఏ కార్యాలయంలో ఆ యన సబ్ కలెక్టరు ఎస్.ప్రశాంత్‌కుమార్‌తో కలిసి పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాల కల్పనపై సెక్టారు, బూత్ స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టరు మాట్లాడుతూ ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు పరిష్కరించే విధంగా బూత్ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు నివేదికలు సమర్పించాలన్నారు. ఎన్నికల సంఘం నిబంధనల మేరకు అధికారులు పనిచేయాలని సూచించారు. ఓటరు జాబితా డివిజన్ కేంద్రం నుంచి ఓటరు లిస్టుకు సంబంధించిన ఫిర్యాదులు రాకుండా పనిచేసే బాధ్యత అధికారులపై ఉందన్నారు. కార్యక్రమంలో తహశీల్దారు ఎ.కృష్ణజ్యోతి, సెక్టారు అధికారులు డీటీలు ఎన్‌వీవీ సత్యనారాయణ, బి.రాజు, సుబ్బారావు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ ఎం.విగ్నేష్, సీనియర్ అసిస్టెంట్లు ఇందిరా బాయి, లక్ష్మణ్, బూత్‌స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నిజమైన ఆదివాసీలకే టిక్కెట్లు ఇవ్వాలి



మాట్లాడుతున్న ఆదివాసీ నాయకులు

వై.రామవరం, ఫిబ్రవరి 9: ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో నిజమైన ఆదివాసీ (ఎస్టీ) అభ్యర్థులను నిలబెట్టడంలో వివిధ రాజకీయ పార్టీలు తీవ్ర వ్యత్యాసాన్ని చూపుతున్నాయని ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కారం అబ్బులు కోయ ఆరోపించారు. ఆదివాసీ, ప్రజా సంఘాల సేవా సంస్థల ప్రతినిధులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అల్లూరి, మన్యం జిల్లాల్లో అభ్యర్థుల ఎంపికలో ఎస్టీలకు జరుగుతున్న అన్యాయాలను ఖండించారు. మాజీ ఎంపీ కొత్తపల్లి గీత నిజమైన ఎస్టీ కాదని భారతీయ జనతా పార్టీ ఆమెకు ఎంపీ సీటు ఇచ్చేందుకు ప్రయత్నిస్తుందని ఇది సమంజసం కాదన్నారు. నిజమైన ఆదివాసీలకు మాత్రమే ఎంపీ, ఎమ్మెల్యే టిక్కెట్లు ఇస్తే గెలిపించుకుంటామని లేదంటే ఓడిస్తామని ఆయా రాజకీయ పార్టీలను వారు హెచ్చరించారు. కార్యక్రమంలో కర్రా నరసన్న, కె.సత్యనారాయణదొర, కె.రాజారావు, కె.లక్ష్మణ రావు తదితరులు పాల్గొన్నారు.

ఆసరా చెక్కులు పంపిణీ

వై.రామవరం, ఫిబ్రవరి 9: మండలంలో నాలుగో విడత వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగులాపల్లి ధనలక్ష్మి పాల్గొన్నారు. తొలుత సిరిమెట్ల గ్రామంలో బ్రిడ్జి నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. చవిటి దిబ్బలలో ఏర్పాటు చేసిన సమావేశంలో రూ.2కోట్ల39లక్షల 55వేల ఆసరా చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం చవిటిదిబ్బలు-బండిగడ్డ బీటీ రోడ్డును ప్రారంభించారు. అలాగే వై.రామవరంలో సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతన భవన నిర్మాణాలను ప్రారంభించారు. ఎంపీపీ ఆనందరావు, జడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో రవికిశోర్, డిప్యూటీ తహసీల్దార్ సుధాకర్, వెలుగు ఏపీఎం సుధాకర్ పాల్గొన్నారు.

జీతాలు అందక ఆర్థిక ఇబ్బందులు

మోతుగూడెం, ఫిబ్రవరి9: ఏపీ జెన్కో ఉద్యోగులకు ఇంత వరకు జీతాలు అందకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. సీలేరు కాంప్లెక్సు పరిధిలోని లోయర్ సీలేరులో 215 మంది, డొంకరాయిలో 90మంది, సీలేరులో 105 మంది మొత్తంగా 410 మంది ఉద్యోగులు (ఇంజనీర్లు, ఉద్యోగులు కలిపి)ఉన్నారు. వారికి పదో తేదీ వస్తున్నప్పటికీ జీతాలు అందకపోవడంతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చాలా మంది జెన్‌కో ఉద్యోగులు ప్రతి నెలా హౌసింగ్ లోన్‌లు, వాహనాలకు సంబంధించిన ఈఎంఐలు 5వ తేదీ లోపు చెల్లించాల్సి ఉంటుంది. అయితే వైసీపీ ప్రభుత్వం వచ్చాక జెన్‌కో సిబ్బంది జీతాలు ఎప్పుడు పడతాయో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వారు బ్యాంక్‌లకు చెల్లించాల్సిన ఈఐఎంల కోసం వడ్డీలకు అప్పులు చేయాల్సిన పరిస్థితి నెలకొందని సీలేరు కాంప్లెక్స్ ఉద్యోగులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి జీతాలు చెల్లించాలని సీలేరు కాంప్లెక్సు ఉద్యోగులు కోరుతున్నారు.



పుస్తకాలు అందిస్తున్న కలెక్టర్ సుమిత్‌కుమార్

ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలి

రంపచోడవరం, ఫిబ్రవరి 9: ఆసుపత్రులలో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టరు సుమిత్‌కుమార్ వైద్యాధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఐటీడీఏ పీవో సూరజ్ గనోరేతో మండలంలోని పెదగెద్దాడ పీహెచ్‌సీని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రికార్డులను పరిశీలించి వైద్యసేవలపై అడిగి తెలుసుకున్నారు. మందులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. అనంతరం హైస్కూల్‌ను సందర్శించి విద్యార్థులకు బోధిస్తున్న తీరును పరిశీలించారు. పాఠశాలకు అదనపు గదులు ఏర్పాటు చేయాలని ఉపాధ్యాయులు కలెక్టరు దృష్టికి తీసుకువచ్చారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్ పుస్తకాలను అందజేశారు. ఎంపీపీ బందం శ్రీదేవి, సర్పంచ్ వడగల ప్రసాద్, ఏడీఎంహెచ్‌వో ప్రకాశం, మండల వ్యవసాయశాఖాధికారి కె.లక్ష్మణ్, ఉపాధ్యాయులు కె.సూరిబాబు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదాతలు కావాలి



రక్తదానం చేస్తున్న డీఎం ఎస్‌కే షబ్నం

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9: రక్తదానంతో ప్రతి ఒక్కరూ ప్రాణదాతలు కావాలని ఆర్టీసీ జిల్లా అధికారిణి కె.షర్మిల అశోక అన్నారు. రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలోని ఉద్యోగుల ట్రైనింగ్ కళాశాల భవనంలో శుక్రవారం రాజమహేంద్రవరం జీజీహెచ్ బ్లడ్ బ్యాంకు, ధన్వంతరి వలంటరీ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఆర్టీసీ ఉద్యోగులు, ఆర్టీసీ హమాలీలు, అవుట్‌సోర్సింగ్ సిబ్బంది సుమారు 90 మంది రక్తదానం చేశారు. రాజమహేంద్రవరం డిపో మేనేజర్ షేక్ షబ్నం, కొవ్వూరు డీఎం వైవీవీ కుమార్ రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో రాజమహేంద్రవరం డిపో అసిస్టెంట్ మేనేజర్ అజయ్‌బాబు, బస్ స్టేషన్ మేనేజర్ త్రిమూర్తులు, ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు.

ఆంధ్ర బయో సమ్మిట్‌లో 'ఆర్ట్స్' విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9: విశాఖపట్నంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన ఆంధ్ర బయోసమ్మిట్- 2024లో తమ కళాశాల బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. 12 మంది బీఎస్సీ బయోటెక్నాలజీ ఫైనలియర్ విద్యార్థులు ఈ సమ్మిట్‌లో పాల్గొని అనేక విషయాలు నేర్చుకున్నారని, పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు పరిశోధనా రంగంలోని అవకాశాలను తెలుసుకున్నారన్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరిని అభినందించారు.

దివంగత నేతలను గౌరవించుకోవాలి



బిక్కవోలు: కొమరిపాలెంలో మాట్లాడుతున్న రామకృష్ణారెడ్డి

- టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి
- కొమరిపాలెం, అనపర్తిలో మాజీ ఎమ్మెల్యే అమ్మిరెడ్డి జయంతి

బిక్కవోలు/అనపర్తి, ఫిబ్రవరి 9: మన ప్రాంత అభివృద్ధికి కృషి చేసిన దివంగత నేతలను గౌరవించుకోవల్సిన బాధ్యత అందరిపై వుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మాజీ ఎమ్మెల్యే పడాల అమ్మిరెడ్డి 80వ జయంతి సందర్భంగా కొమరిపాలెంలోని ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ అమ్మిరెడ్డి స్మారకంగా గ్రామంలోని మార్కెట్‌షెడ్‌కు, ప్రక్కనే వున్న వాకింగ్ ట్రాక్‌కు అమ్మిరెడ్డి పేరు పెట్టామన్నారు. త్వరలో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమని, అప్పుడు ఆయన కాంస్య విగ్రహాన్ని గ్రామంలో ఏర్పాటు చేస్తామని గ్రామస్థులకు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో అమ్మిరెడ్డి కుమారుడు పడాల రామారెడ్డి, టీడీపీ నాయకులు డీవీఆర్, నల్లమిల్లి వెంకటసుబ్బారెడ్డి, కర్రి శ్రీనివాసరావు, చిట్టిబాబుచౌదరి, తనుకు శ్రీధర్ పాల్గొన్నారు.

అనపర్తిలోని జీబీఆర్ కళాశాల ప్రాంగణంలో పడాల అమ్మిరెడ్డి విగ్రహానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాశాల ఏర్పాటులో ఆయన కృషిని ప్రశంసించారు. తేతలి నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్స్ ఎస్‌పీ అబ్బాయిరెడ్డి, పీఆర్ఎల్ స్వామి, బి.రత్నారెడ్డి, డీవీఆర్‌పి పాపిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అనపర్తిలో ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్ సాధిస్తాం

అనపర్తి, ఫిబ్రవరి 9: అనపపర్తి రైల్వేస్టేషన్‌లో జన్మభూమి ఎక్స్‌ప్రెస్ హాల్ట్‌ను తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత సాధించి తీరుతామని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రామవరంలో అనపర్తి రైల్వేస్టేషన్ అభివృద్ధి, ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్టులపై తనను కలిసిన రైల్వే ప్రయాణికులు, ఫైనాన్స్ వ్యాపారులనాయన మాట్లాడారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ రైల్వేస్టేషన్ అభివృద్ధి, గోదావరి ఎక్స్‌ప్రెస్ రైళ్ల హాల్ట్‌లు నల్లమిల్లి మూలారెడ్డి ఎమ్మెల్యేగా ఉండగా సాధించారని, ఎంపీగా ఉన్న మురళీమోహన్ రత్నాచల్ ఎక్స్‌ప్రెస్ హాల్టు సాధించారన్నారు. ఐదేళ్లలో ఎంపీ భరత్‌రామ్ ఇచ్చిన హామీ ఒక్కటీ నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో పలువురు రైల్వే ప్రయాణికులు, వ్యాపారులు పాల్గొన్నారు.

గ్రామాల్లో సిబ్బంది సమన్వయంతో పనిచేయాలి

- కోరుకొండ మండల సమావేశంలో ఎంపీడీవో హేమసుందర్రావు



ఎంపీడీవోను అభినందిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీలు

కోరుకొండ, ఫిబ్రవరి 9: గ్రామాల్లో ప్రభుత్వ శాఖల సిబ్బంది సమన్వయంతో పని చేయాలని, అభివృద్ధికి ఆటంకం కలకుగండా చూసుకోవాలని ఎంపీడీవో హేమసుందర్రావు తెలిపారు. కోరుకొండ మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శుక్రవారం సాయంత్రం ఎంపీపీ వుల్లి సూర్యకుమారి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వివిధ ప్రభుత్వ శాఖల పనితీరుపై సమీక్షించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ మరికొద్ది రోజుల్లో సార్వత్రిక ఎన్నికల నోటిఫికేషన్ రానుందని, నోటిఫికేషన్ వచ్చాక నూతన అభివృద్ధి పనులు చేపట్టకూడదన్నారు. ఇప్పటికే ప్రారంభించిన పనులు కొనసాగించవచ్చన్నారు. అంతకుముందు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీవో హేమ సుందరరావును ఎంపీపీతోపాటు వైస్ ఎంపీపీ కొయిడాల స్వర్ణకుమారి, బొరుసు నాగమణి, బొరుసు బద్రి, వుల్లి బుచ్చిబాబు, నక్కా రాంబాబు ఘనంగా సత్కరించారు. సమావేశంలో ఎంపీటీసీలు కాలచర్ల నాగు, గట్టి ప్రసాద్, రొంగల లక్ష్మమ్మ, సర్పంచ్‌లు వుల్లి అప్పన్నదొర, జాజుల రాము, కడియాల పాపారావు పాల్గొన్నారు.

పీవీకి భారతరత్న ప్రకటనపై హర్షం



కడియంలో పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బాబు, సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: మాజీ ప్రధాని దివంగత పీవీ నరసింహారావుకు కేంద్ర ప్రభుత్వం అత్యున్నత భారతరత్న పురస్కారం ప్రకటించడం పట్ల టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి శిష్లాలోహిత్ హర్షం వ్యక్తం చేసారు. ఈ మేరకు రాజమహేంద్రవరంలో శుక్రవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. బ్రౌన్ మందిరం నిర్వాహకుడు సన్నిదానం శాస్త్రి అధ్యక్షతన పీవీ పార్కువద్ద ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాటూరి రంగారావు, ప్రముఖ గాయకులు మల్లాది శ్రీరామ్, దుర్వాసుల సత్యనారాయణ, వై.చిట్టిబాబు, దుర్గాభవాని, కె.రమేష్, హుస్సెన్ మహ్మద్, కురసం రాజ్‌కుమార్ పీవీ నరసింహారావు విగ్రహానికి పుష్పాంజలి ఘటించారు.

కడియం: కడియంలోని గిరజాల కృష్ణారావు కళావేదికలో పీవీ చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా బాధ్యత సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు మాట్లాడుతూ మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ప్రకటించడం ఆనందదాయకమన్నారు. మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌కు, మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న పురస్కారం ఇవ్వాలని తాము బాధ్యత సేవాసంస్థ తరుపున పుష్కరకాలంగా కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎన్ మూర్తి, చిలుకూరి శ్రీనివాసరావు, చిక్కాల శ్రీనివాసరావు, కుసునూరి బా బులు, పిండి నాగరాజు, పూడి బ్రహ్మం, మండపల్లి త్రిమూర్తులు ఉన్నారు.

ఓటు అనే వ్యాక్సిన్‌తో వైసీపీ వైరస్‌ను తరిమేద్దాం

- భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్, అనుశ్రీ



భవిష్యత్తుకు గ్యారెంటీలో ఆదిరెడ్డి శ్రీనివాస్

రాజమహేంద్రవరంసిటీ, ఫిబ్రవరి 9: రానున్న ఎన్నికల్లో ఓటు అనే వ్యాక్సిన్‌తో రాష్ట్రానికి పట్టిన వైసీపీ వైరస్‌ను తరిమేసి తెలుగుదేశం పార్టీని అధికారంలోకి తీసుకొద్దామని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్, జనసేన పట్టణ ఇన్‌చార్జి అనుశ్రీ సత్యనారాయణ అన్నారు. రాజమండ్రి 1వ డివిజన్ తారకరామా నగర్ లో మాజీ కార్పొరేటర్ కడలి రామకృష్ణ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేశారు. సుస్థిరమైన పాలన కోసం టీడీపీ జనసేన కూటమిని అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి కాశి నవీన్‌కుమార్, నగర అధ్యక్షుడు రెడ్డిమణి, ఉప్పులూరి జానకిరామయ్య, జనసేన నగర అధ్యక్షుడు వై.శ్రీను తదితరులు పాల్గొన్నారు

3వ రోజు ఆదిరెడ్డి ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరంలో భవాని చారిటబుల్ ట్రస్ట్, వాసవి శ్రీమల్టీ స్పెషాలిటీ సంయుక్త ఆధ్వర్యంలో మూడో రోజు శుక్రవారం 36వ డివిజన్‌లో వాంబే కాల నీ వద్ద ఏర్పాటు చేశారు. ఆదిరెడ్డి శ్రీనివాస్ శిబిరాన్ని ప్రారంభించారు. కాశి నవీన్‌కుమార్, మాజీ కార్పొరేటర్ బాబితో కలిసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో బంగారు నాగేశ్వరరావు, లచ్చిరెడ్డి వాసు, సలాది ఆనంద్, కొల్లి బుజ్జి, వేణు, తుల్లి పద్మ, కె.శ్యామల, నాగలక్ష్మి పాల్గొన్నారు.

ఆశావర్కర్లపై ప్రభుత్వ తీరుకు నిరసన

గోకవరం, ఫిబ్రవరి 9: తమకు కనీసం వేతనం రూ.26,000 చెల్లించాలని ఆశావర్కర్లు డిమాండ్ చేశారు. గురువారం చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులు, నిర్బంధాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. దీనిలో భాగంగా గోకవరంలో స్థానిక పంచాయతీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సెలవులు, మెడికల్ వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చేయాలని, సంబంధంలేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్లను నేరవేర్చాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనపర్తి: మండలంలోని రామవరం, కుతుకులూరు పీహెచ్‌సీల వద్ద ఆశా వర్కర్లు ధర్నాలు నిర్వహించారు. యూనియన్ నాయకులు అనూష, రాజకుమారి మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలతో తమ పోరాటాన్ని ఆపలేరని, డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన కొనసాగిస్తామని అన్నారు.

క్రైస్తవుల్ని మోసం చేసిన జగన్‌ను ఓడించండి

బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: క్రైస్తవులకు తానే రక్షణ అని చర్చిలకు వచ్చి వాగ్దానాలు చేసి నమ్మించి అధికారంలోకి వచ్చాక మోసం చేసిన సీఎం జగన్‌ను ఈ ఎన్నికల్లో ఓడించాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పట్నాల విజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. రాజమండ్రి ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మణిపూర్ సంఘటన జరిగితే కనీసం స్పం దించలేదన్నారు. పైగా జగన్ అధికారంలోకి వచ్చాక పవిత్రమైన చర్చిలలో కూడా రెండేసి వర్గాలుగా మారి గోడవలు జరుగుతున్నాయని చెప్పారు. బీఎస్పీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పరంజ్యోతి ఆదేశాల మేరకు జిల్లాలోని ఏడు నియోజకవర్గాల్లో పోటీకి దిగుతుందని చెప్పారు. సమావేశంలో బీఎస్పీ రూరల్ అధ్యక్షుడు గెడ్డం ప్రసాద్, ఉపాధ్యక్షుడు కొండపల్లి సూరిబాబు,అర్బన్ అధ్యక్షుడు రిటైర్డ్ ఏఎస్‌ఐ రామకృష్ణ, కొత్తపల్లి చిన్నబాబు తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



గోకవరం, ఫిబ్రవరి 9: మండలంలోని వీరలింకపల్లి, పెంటపల్లి, రంప యర్రంపాలెం, గంగంపాలెం, తిరుమలాయపాలెం, మల్లవరం గ్రామాలలోని పోలింగ్ కేంద్రాలను శుక్రవారం తహశీల్దారు హేమకుమారి పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో తాగునీరు, టాయిలెట్లు, విద్యుత్ సదుపాయం ఉండేలా చర్యలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. ఆమె వెంట రెవెన్యూ సిబ్బంది శ్రీరాములు, అంబటి రజని, ఇందిరప్రియదర్శిని, తదితరులున్నారు.

శాస్త్ర విజ్ఞానంపై అవగాహన పెంచుకోవాలి

రాజమహేంద్రిలో సైన్స్ కళాయాత్ర

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9: శాస్త్ర విజ్ఞానంపై ప్రతి విద్యార్థి అవగాహన పెంచుకోవాలని రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థల కరస్పాండెంట్ టీకే విశ్వేశ్వరరెడ్డి అన్నారు. జనవిజ్ఞాన వేదిక ఆంధ్రప్రదేశ్‌శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్రలో భాగంగా రాజమహేంద్రి మహిళా విద్యాసంస్థలో శాస్త్రవిజ్ఞాన జాత నిర్వహించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ బి.చైతన్యశేఖర్, జిల్లా అధ్యక్షుడు ఎం.మల్లికార్జునరావు మాట్లాడుతూ రాష్ట్రస్థాయి సైన్స్ కళాయాత్ర ఫిబ్రవరి 5వ తేదీ నుంచి 18వ తేదీ వరకూ శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకూ జరుగుతుందన్నారు. విద్యార్థులు, ప్రజల్లో శాస్త్ర విజ్ఞానంపై అవగాహన కల్పించడం, వారిని చైతన్యపర్చడం కళాజాత ముఖ్యోద్దేశమన్నారు. శాస్త్ర విజ్ఞానంపై ప్రదర్శించిన నృత్య రూపకాలు, కళా ప్రదర్శనలు, విజ్ఞాన ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌందర్య, జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి వై.పైడయ్య, జిల్లా కార్యదర్శి సీహెచ్ శ్రీరాములు, రాజమహేంద్రవరం కన్వీనర్ జి.తాతారావు, యూటీఎఫ్ నాయకులు రమేష్, జిల్లా కోశాధికారి ఎన్.రవిబాబు, మురళీధర్ పాల్గొన్నారు.

ఫాదర్ దేవదాసయ్య జ్ఞాపకార్థ కూటమి

కడియం, ఫిబ్రవరి 9: జేగురుపాడు వైస్సార్ కాలనీలో సంఘకాపరి రెవ. సీహెచ్ రత్నదీప్ ఆధ్వర్యంలో ఫాదర్ ఎం.దేవదాసయ్య 64వ జ్ఞాపకార్థకూటమి జరిగింది. దేవదాసయ్య జేగురుపాడులో పుట్టి బైబిల్‌మిషన్ స్థాపించి ప్రపంచవ్యాప్తంగా వృద్ధి చెందించారన్నారు. కార్యక్రమంలో పాస్టర్ శ్రీవల్లి, సంగీత, మురళి, సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

వెట్టిచాకిరీ నిర్మూలన సామాజిక బాధ్యత

డీఎల్ఎస్‌ఏ కార్యదర్శి ప్రత్యూషకుమారి

రాజమహేం ద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): వెట్టిచాకిరీ నిర్మూలనకు కృషి చేయడం సామాజిక బాధ్యత అని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.ప్రత్యూషకుమారి పిలుపునిచ్చారు. వెట్టిచాకిరీ నిర్మూలనా దినం సందర్భంగా శుక్రవారం డీఎల్ఎస్ఏ, ఇంటర్నేషనల్ మిషన్ ఫర్ జస్టిస్ సంయుక్త ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. రాజ్యాంగంలోని 23వ అధికరణం ప్రకారం మానవ అక్రమ రవాణా, వెట్టిచాకిరీ నిషేధమన్నారు. అంతకుముందు డీఎల్ఎస్ఏ నుంచి పుష్కర్‌ఘాట్ వరకూ ర్యాలీ చేశారు. మానవహారంగా ఏర్పడి వెట్టిచాకిరీ నిర్మూలనపై నినాదాలు చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ బీఎస్ఎం వలీ, ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జిస్వాతి పాల్గొన్నారు.

దగాపడ్డ జనం కోసం లోకేశ్ శంఖారావం : గోరంట్ల

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: దగాపడిన జనం కోసం టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శంఖారావం పూరించబోతున్నారని ఆ పార్టీ పొలిట్ బ్యూరోసభ్యుడు ,రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ శంఖారావం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా పర్యటించనున్న లోకేశ్ టీడీపీ ప్రకటించిన భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాలపై అవగాహన కల్పిస్తారన్నారు. బాబు సూపర్ 6 పథకాల ద్వారా ప్రజల జీవితాల్లో ఎటువంటి మార్పులు రాబోతున్నాయో వివరిస్తారన్నారు. భవిష్యత్తు కు గ్యారెంటీ పథకాల్లో భాగంగా నిరుద్యోగులు, మహిళలు, రైతులు, బీసీలకు చేయూత ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారన్నారు.

ఎస్పీలతో పీడీజే సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జగదీష్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకొని తూర్పు, కోనసీమ, కాకినాడ ఎస్పీలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత సమావేశమయ్యారు. వారి పరిధిలోని రాజీకి అర్హమైన కేసులను గుర్తించి ఆ జాబితాను న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీ పీలు జీఎస్‌వీ ప్రసాదరావు, జి.వెంకటరత్నం, ఎస్పీలు పి.జగదీశ్, ఎన్.శ్రీధర్, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ ఏ.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్



శిక్షణలో ఈవీఎంలపై అవగాహన కల్పిస్తున్న దృశ్యం

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్‌వో, కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఈవీఎంల వినియోగంపై సెక్టార్ అధికారులు, బీఎల్ వోలు,సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సమయంలో చివరి నిమిషంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల, పోస్టల్ బ్యాలెట్లపై మాస్టర్ ట్రైనర్ ఏవీ శ్రీనివాస్, ప్రిసెస్మెంట్లు రామనాగేశ్వరావు, వేణుమోహన్ కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణి, ఈఈ మదర్సా ఆలీ, శేషగిరిరావు, తహశీల్దార్ కె.ఆంజనేయులు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, సెక్రటరీ టి.సుధాకర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ అప్సర్ తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారావు



సమావేశంలో మాట్లాడుతున్న రమణారావు

రంగంపేట, ఫిబ్రవరి 9: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని, పట్టుదలతో చదివి పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించడానికి కృషి చేయాలన్నారు. డీవైఈవో ఈవీఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ ఆధ్వర్యంలో ప్యానల్ టీచర్స్ ఉపాధ్యాయుల విద్యాబోధను పరిశీలించారు. వ్యాయామోపాధ్యాయుడు బాపిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన యోగాభ్యాసాలు, వివిధ విన్యాసాలను ఉపాధ్యాయులు తిలకించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వడిశలేరులో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'

రంగంపేట, ఫిబ్రవరి 9: మండలంలోని వడిశలేరులో శుక్రవారం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి కుమారుడు నల్లమిల్లి మనోజ్, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ళ గోవింద్ ఆధ్వర్యంలో భవిష్యత్తుకు గ్యారెంటీ మహాశక్తి ప్రచారం కార్యక్రమం జరిగింది. తెలుగు మహిళలు గ్రామంలోని పీరాపంజా వీధి, అరుంధతీయ నగర్, ఎస్సీకాలనీల్లో పర్యటించారు. ఇంటింటికీ వెళ్లి మహాశక్తి పథకాలను వివరించారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ-జనసేన కూటమికి ఓటు వేసి గెలిపించాలని కోరుతూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో శేషారత్నం, సత్యగౌరి, సత్యవతి, గౌతమి,సుభాషిణి, జి.తులసి నీలపాల త్రిమూర్తులు, పోతుల వెంకటరావు, సిరసపల్లి నాగేశ్వరరావు, అడబాల వెంకటరావు పాల్గొన్నారు.


ఒక యువతి, ఒక బాలిక అదృశ్యం

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): ఆనంద్‌నగర్‌కి చెందిన 20ఏళ్ల యువతి నగరంలోని ఓ వస్త్ర దుకాణంలో పని చేస్తోంది. రోజూ మాదిరిగానే ఈ నెల 8న ఉద్యోగానికి ఇంటి నుంచి బయలుదేరి తిరిగి రాలేదని ఆమె తల్లి ఫిర్యాదుతో త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. అలాగే ఆల్‌కట్ గార్డెన్స్‌కి చెందిన 17 ఏళ్ల బాలిక 8న ఇంటి నుంచి బయటికి వెళ్లి తిరిగి రాలేదనే ఫిర్యాదుతో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

సినిమా గైడ్

(రాజమహేంద్రవరం)

శ్యామల	: కిస్మత్
సూర్యామినీ	: గేమ్ ఆన్
సూర్యాప్యాలస్	: ఫైటర్, హాపీ ఎన్‌డింగ్
స్వామి	: బూట్‌కట్ బాలరాజు
శివజ్యోతి	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
అనుశ్రీ(సాయికృష్ణ)	: హనుమాన్
రాజా	: హనుమాన్
అశోక	:
ఊర్వశి	: నా సామి రంగ
రంభ	: కెప్టెన్ మిల్లర్
మేనక	: ధీర
అప్సర	: గుంటూరు కారం
కుమారి	: అంబాజీపేట మ్యారేజీ బ్యాండ్
వీఎస్ మహాల్(నామవరం)	: హనుమాన్
మురళీకృష్ణ(ధవళేశ్వరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
వెంకటసూర్య(కడియం)	: హనుమాన్
సత్యగౌరి (అనపర్తి)	: హనుమాన్
సూర్యశ్రీ (అనపర్తి)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
ఫార్చ్యూన్ సినిమాస్(రాజానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
రామకృష్ణ(కోరుకొండ)	: హనుమాన్
గీతాసినిమాస్ (సీతానగరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
శ్రీనివాస (గోకవరం)	: సైంధవ్
టీడీ సినీ మ్యాక్స్ (గోకవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
లలితామహాల్(రంపచోడవరం)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్
నవయుగ(చింతూరు)	: అంబాజీపేట మ్యారేజీబ్యాండ్



డీఈవో బాధ్యతల స్వీకరణ

రాజమహేంద్రవరం,ఫిబ్రవరి9(ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా విద్యాశాఖాధికారిగా కె.వాసుదేవరావు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల సంఘం నిర్దేశాల ప్రకారం జరిగిన బదిలీల్లో ఇక్కడ పనిచేస్తున్న ఎస్.అబ్రహాం ఏలూరు జిల్లాకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో విజయనగరం జిల్లా ఉపవిద్యాశాకాధికారి వాసుదేవరావును ప్రభుత్వం నియమించింది. కలెక్టర్ మాధవీలతను కలిసి మొక్కను అందజేశారు.


ఏర్పాట్లు పరిశీలిస్తున్న హర్షకుమార్ తదితరులు

రేపు దళిత సింహగర్జన సభ

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: రాజమహేంద్రవరం జాతీయ రహదారి వేమగిరి వద్ద సుమారు 50 ఎకరాల్లో ఆదివారం నిర్వహించనున్న దళిత సింహగర్జన సభ ఏర్పాట్లు వేగవంతంగా చేస్తున్నారు. మాజీ ఎంపీ జీవీ హర్షకుమార్ శుక్రవారం ఏర్పాట్లను పరిశీలించారు. దేశ వ్యాప్తంగా పలు రాష్ట్రాల నుంచి దళిత ప్రతినిధులతో పాటు ఉభయ తెలుగురాష్ట్రాల నుంచి భారీగా దళిత సంఘాలు, నాయకులు ఈ సభకు తరలివస్తారన్నారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు దళిత సింహగర్జన సభ ప్రారంభమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం దళితుల అణచివేత, 27 సంక్షేమ పథకాల రద్దు,దళితులపై జరిగిన మారణకాండ, దళిత విద్యార్థుల భవిష్యత్ ప్రశ్నార్థకం తదితర సమస్యలపై ప్రశ్నిస్తామన్నారు.ఈ సభ ద్వా రా జగన్ ప్రభుత్వంపై యు ద్ధం ప్రకటించబోతున్నారు. ఈ సభకు కాపునాడు రాష్ట్ర జేఏసీ, కోనసీమ కాపు జేఏసీ కూడా మద్దతు ప్రకటించింది. సభ ఏర్పాట్లను మాజీ ఎంపీ జీవి హర్షకుమార్, తనయుడు జీవీ శ్రీరాజ్ , దళిత సంఘాల నేతలు పర్యవేక్షిస్తున్నారు. 25 వేల మంది కూర్చునే విధంగా ఏర్పాట్లు చేశారు. దూరప్రాంతాల నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ సభా ఏర్పాట్లపై పోలీస్ నిఘా కూడా ఉంది.


ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న కలెక్టర్ మాధవీలత

3,88,268 మంది చిన్నారులకు నులి పురుగుల నివారణ మాత్రలు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : ప్రతి విద్యార్థి ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవడం ద్వారా నులిపురుగులను నివారించవచ్చని కలెక్టర్ కె.మాధవీలత అన్నారు. ఆరోగ్యమే మహాభాగ్యం, ఆరోగ్యంగా ఉంటే చదువుల్లోనూ బాగా రాణించవచ్చని పేర్కొన్నారు. జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమం పురస్కరించుకుని శుక్రవారం నులిపురుగుల నివారణ మాత్రలు (ఆల్బెండజోల్) పంపిణీ కార్యక్రమాన్ని రాజమహేంద్రవరం చున్నీలాల్ జాజూ రోటరీ మున్సిపల్ ఉన్నతపాఠశాలలో కలెక్టర్ ప్రారంభించారు. స్కూల్ చిన్నారులతో కలెక్టర్ ముచ్చటించారు. 1 నుంచి 19 ఏళ్ల లోపు వయస్సున్న 3,78,949 మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా గుర్తించిన 3595 సంస్థల్లో మాత్రలు పంపిణీ చేస్తున్నట్టు తెలిపారు. మొత్తం 3,88,268 మంది పిల్లలకు గాను తొలిరోజు 98 శాతం లక్ష్యం సాధించామని పేర్కొన్నారు. డీఎంహెచ్‌వో డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీఎల్ఏటీవో డాక్టర్ ఎస్.వసుంధర, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ వినూత్న తదితరులు పాల్గొన్నారు.


గోపాలపురంలో ఆందోళన చేస్తున్న ఆశ కార్యకర్తలు

ఆశ కార్యకర్తల ఆందోళన

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : చలో విజయవాడ సందర్భంగా ఆశ కార్యకర్తలపై జగన్ ప్రభుత్వం పోలీసులను ప్రయోగించి నిర్బంధాన్ని విధించినందుకు నిరసనగా ఈ నెల 9, 10 తేదీల్లో ప్రభుత్వ కార్యక్రమాలను బాయ్‌కట్ చేయడం జరిగిందని ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా కోశాధికారి ఎం.వెంకటలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ పేర్కొన్నారు. జగన్మోహనరెడ్డి ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయని స్పష్టం చేశారు. రాజమహేంద్రవరం సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆశ వర్కర్లు ధర్నా చేశారు.ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాజమహేంద్రవరం అధ్యక్ష కార్యదర్శులు దుర్గ, హవేలా, మంగ, సత్య, కమల,సునీత, జయ, రామలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సీతానగరం శిరోముండనం బాధితురాలి
స్టేట్‌మెంట్ నమోదు

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): సీతానగరంలోని శిరోముండనం కేసులో బాధితురాలు షేక్ ఆశాను శుక్రవారం సాయంత్రం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ముందు పోలీసులు ప్రవేశపెట్టారు. న్యాయమూర్తి ఆమె స్టేట్‌మెంట్(164)ని నమోదు చేశారు. ఈ మేరకు జడ్జి ఎదుట ఆమె తన గోడు వెళ్లబోసుకుని కన్నీటి పర్యంతమైంది. న్యాయం చేయాలని వేడుకున్నారు. అనంతరం ఆమెను వసతి పొం దుతున్న స్టేట్‌హోంకి పోలీసులు తరలించారు.


చాగల్లు రచ్చబండలో వినతులు స్వీకరించి.. సమస్యలు తెలుసుకుంటున్న వైఎస్ షర్మిలరెడ్డి

మాట నిలబెట్టుకోలేని జగన్.. వైఎస్ వారసుడు కాదు!

- జగన్ ఒక్క హామీని నెరవేర్చలేదు
- మద్యం నిషేధం అటకెక్కింది..
- సంక్షేమం పేరుతో సంపద దోపిడీ
- ఏపీ ప్రయోజనాలు బీజేపీకి తాకట్టు
- ప్రత్యేక హోదా ఏం చేశారు..
- హోం మంత్రి రాజీనామా చేయాలి
- చాగల్లు రచ్చబండలో షర్మిలరెడ్డి

కొవ్వూరు, ఫిబ్రవరి 9 : జగన్మోహనరెడ్డి ప్రభుత్వం సంక్షేమం పేరుతో మట్టి బిందే ఇచ్చి.. వెండి బిందె దోచుకుంటుందని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి అన్నారు. ముందు వై.ఎస్ షర్మిలారెడ్డికి కొవ్వూరు మండలం పంగిడి గ్రామంలో తీన్‌మార్ డప్పులు, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. నల్లజర్ల నుంచి పంగిడి, మీనానగరం మీదుగా కొవ్వూరు నియోజకవర్గం చాగల్లు గ్రామంలో శుక్రవారం నిర్వహించిన రచ్చబండ సభకు చేరుకున్నారు. అంబేడ్కర్, దివంగత ముఖ్యమంత్రి వై.ఎస్.రాజశేఖరరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రచ్చబండ కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.జగన్,చంద్రబాబులు ప్రత్యేక హోదా ఎందుకు తీసుకురాలేకపోయారని ప్రశ్నిం చారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ఏం సహాయం చేసిందని అధికార, ప్రతిపక్షాలు పొత్తుల కోసం ఎగబడుతున్నారన్నారు. పోలవరం, ప్రత్యేక హోదా, రాజధాని, ఇలా ఏపీ ప్రజల ప్రయోజనాలను తాకట్టు పెడుతున్నారన్నారు. బీజేపీ రాష్ట్రాన్ని మోసం చేసిందన్నారు. గత పదేళ్లలో టీడీపీ, వైసీపీకి అధికారం ఇచ్చి మోసపోయారన్నారు.ప్రతి ఒక్కరూ రాష్ట్ర ప్రయోజనాల కోసం నిజమైన ఉద్యమం చేయాలన్నారు. బీజేపీకి గులాంగిరి చేసే పార్టీలు నశించిపోవాలన్నారు.నా పుట్టింటికి మేలు చేయడానికి నేను సిద్ధం అన్నారు. రాష్ట్రంలో 60 మంది దళితులపై దాడులు జరిగాయన్నారు. హోంమంత్రి ప్రాతినిధ్యం వహిస్తున్న కొవ్వూరు నియోజకవర్గంలో దళితులు హత్యలకు గురయ్యారన్నారు. హోంమంత్రి దళితురాలై ఉండి దళితులను కాపాడుకోలేకపోతే ఇంక పదవులు ఎందుకు అన్నారు. తక్షణం హోంమంత్రి తన పదవికి రాజీనామా చేయాలన్నారు. పాదయాత్రలో జగనన్న ఇంటిలో ఎంతమంది పిల్లలు ఉంటే అందరికి అమ్మఒడి ఇస్తానని.. అధికారంలోకి వచ్చాక ఒకరికే ఇస్తున్నారన్నారు. ఫీజు రియంబర్స్‌మెంటు ఎత్తేశారు. చదువుకున్నా ఉద్యోగాలు రావడం లేదన్నారు. మద్యం పేరుతో సర్కార్ దోపిడీ చేస్తుందన్నారు. నాణ్యతలేని మద్యం తాగి లివర్ పాడై అనారోగాలకు గురవుతున్నారన్నారు. చాగల్లు జైపూర్ షుగర్స్ ఫ్యాక్టరీ తెరిపిస్తామన్నారు.

ఎవరేం మాట్లాడారంటే..

- మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంటు బొంతా శ్యాం రవిప్రకాష్ మాట్లాడుతూ ఎన్నికల ముందు పాదయాత్రలో జగన్మోహనరెడ్డి రాజన్న రాజ్యం తీసుకొస్తానని చెప్పి అధికారం వచ్చిన తరువాత మట్టి, ఇసుక, మద్యం పేరుతో దోచుకుంటున్నారన్నారు. జగనన్నకు చెబుదాం టోల్‌ఫ్రీ నంబరుకు 7 సార్లు ఫిర్యాదుచేసినా ఎవ్వరు పట్టించుకోలేదన్నారు. ఇసుక అక్రమ డ్రెజ్జింగ్‌తో వంతెనల మనుగడ దెబ్బతింటుందన్నారు.హోంమంత్రి ప్రాతినిధ్యంవహిస్తున్న కొవ్వూరు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో నిర్వీర్యం చేశారన్నారు.రాష్ట్రంలో దళితులకు రక్షణ లేకుండా పోయిందన్నారు.హోంమంత్రి నియోజకవర్గంలో ఉన్నామని చెప్పుకోవడానికి సిగ్గు పడుతున్నామన్నారు.
- కొవ్వూరుకు చెందిన ఆటోడ్రైవర్ పాబోలు రత్నప్రసాద్ మాట్లాడుతూ మా పాపకు ఏడాది వయసులో కింద పడి తలకు దెబ్బతగిలి బ్రెయిన్‌లో నరం దెబ్బ తింది.కాలు, చెయ్యి పక్షవాతం వచ్చినట్లుగా తయారైంది.చికిత్స చేయించడానికే ఆర్థికభారం గా ఉంది. పింఛను అందించాలని స్వయంగా జగన్మోహనరెడ్డిని రెండు సార్లు కలిసి విన్నవించిన ఫలితం లేదు.
- సమగ్ర శిక్షా జేఏసీ నాయకుడు వెంకట్ మాట్లాడుతూ అధికారంలోకి వస్తే సమగ్ర శిక్షా సిబ్బందిని రెగ్యులర్ చేస్తానని పాదయాత్రలో సీఎం జగన్మోహనరెడ్డి హామీ ఇచ్చారు. ఐదేళ్లగా పట్టించుకోలేదు.గత నెలలో రాష్ట్ర వ్యాప్తంగా 22 రోజులు సమ్మె చేపట్టాం. ప్రభుత్వ పెద్దలు చర్చలు జరిపి సమ్మె విరమింపజేశారు.నెలరోజులు గడుస్తున్నా డిమాండ్ల పరిష్కారానికి సంబంధించి సమాచారం లేదు.

ఒక్క హామీ నిలబెట్టుకోలేదన్నారు. మద్యపానం నిషేదం చేసి ఓటు అడుగుతామన్నారు. మద్యపాన నిషేధం ఎక్కడని ప్రశ్నించారు. మాట నిలబెట్టుకోలేని మీరెలా వైఎస్ఆర్ వారసులవుతారన్నారు. వైఎస్ఆర్ ఆశయాల సాధనకే నేను నా పుట్టింటికి వచ్చాను.. ఆశీర్వదించాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పోలవరం పూర్తవుతుంది. హోదా వస్తుంది, యువతకు ఉద్యోగాలు వస్తాయన్నారు. పలువురు మహిళలు, రైతులు మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులపై దాడులు పెరిపోయాయని, ధరలు ఆకాశనంటుతున్నాయని, ఆంక్షల పేరుతో ఇళ్లస్థలాలు, పించన్లు తొలగిస్తున్నారన్నారు. ఎరువులు, పురుగుల మందుల ధరలు పెరిగిపోవడంతో కౌలు రైతులు సాగు ఖర్చు పెరిగిపోయి తీవ్ర నష్టాల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.చాగల్లులో రచ్చ బండ ముగిసిన అనం తరం కొవ్వూరు యువరాజ్ కళ్యాణ మండపం చేరుకుని భోజన అనంతరం గామన్‌బ్రిడ్జి మీదు గా తుని బయలుదేరారు.ఈ కార్యక్రమంలో గిడుగు రుద్రరాజు, జేడీ.శీలం, ఎన్.రఘువీరారెడ్డి, జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, సుంకర పద్మశ్రీ, ముళ్ల మాధవ్, అమర్ జహ బేగ్ మహ్మద్, బాలేపల్లి మురళీధర్, డా. వడయార్, మార్టిన్ లూథర్, గంధం పూజ్య నరసింహ బాపూజీ, ఎండి రఫీయుల్లాబేగ్, చిన్నం మురళీ, సాయిన సుబ్బారావు, జొన్న కూటి రవి, ఆకుల భాగ్యలక్ష్మి, బండి భాస్కరరావు, గెడ్డం సాయిబాబా, కొణిదల శ్రీనివాస్, సాకా పుల్లారావు, బోడా వెంకట్, అంకంగోపి, కూరెళ్ల గంగరాజు, తాడాల కొండరాజు, జక్కంపూడి సత్తిబాబు, ముప్పిడి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మట్టినీ.. వదలరు



ఇలా కొల్లగొట్టేస్తున్నారు : పెరవలి మండలం కాకరపర్రులో లంకమట్టిని తవ్వుకుపోతున్న అక్రమార్కులు

- కన్నుపడితే ఖాళీయే
- లంకలను కొల్లగొట్టేస్తున్నారు..
- రెచ్చిపోతున్న మట్టి మాఫియా
- అనుమతుల్లేకుండానే తవ్వకాలు
- పగలూ రాత్రీ ఇదే పని
- అయినా పట్టని అధికారగణం
- మామూళ్లే కారణమని ఆరోపణలు
- కాకరపర్రులో లారీల అడ్డగింత
- నేటికీ కేసు నమోదు కాని వైనం?

గోదారి లంకలను కొల్లగొడుతున్నారు..

పెరవలి,ఫిబ్రవరి 9 : ఇసుకే కాదు.. మట్టినీ వదలడం లేదు.. ఎక్కడ కనబడితే అక్కడే తవ్వేస్తున్నారు.. అయినా మాట్లాడేవారు లేరు.. కనీసం కన్నెత్తి చూసేవారే లేరు.. చెరువులే కాదండోయ్ చివరికి గోదావరిని వదలడంలేదు. ఏదైనా మాట్లాడితే అనుమతులు ఉన్నాయంటూ హడావుడి చేస్తున్నారు.. కాకరపర్రులో గురువారం రాత్రి జరిగిన సంఘటనే అందుకు నిదర్శనం.కాకరపర్రు గోదావరి నుంచి ప్రతి రోజూ వందలాది లారీల్లో మట్టిని యథేచ్ఛగా తరలించేస్తున్నారు.. వాహనాలు అటూ ఇటూ తిరగడం ప్రమాదకరంగా ఉండడంతో స్థానికులు మట్టి లారీలను అడ్డుకున్నారు. దీంతో ఎస్ఐ రంగంలోకి దిగి లారీలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.అయితే ఇంకా కేసు నమోదు చేయకపోవడం గమనార్హం. అధికారుల చర్యలు తూతూమంత్రంగా ఉండడంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు.

లంకలు కొల్లగొడుతున్నారు..

పచ్చని పంట పొలాలతో కళకళలాడాల్సిన భూములు నిస్సారమై బీడు భూములను తలపించేలా ఉంటున్నాయి. తూర్పుగోదావరి జిల్లా అంతా దాదాపు గోదావరి పరీ వాహక ప్రాంతమే. తాళ్లపూడి మండలం నుంచి మొదలుకుని ధవళేశ్వరం, కడియం, పెరవలి వరకూ ఉంటుంది. దీంతో గోదావరి వరద కారణంగా ఎంతో మంది రైతులు భూములు కోల్పోయారు. గోదావరి పొడవునా గత 50 ఏళ్లలో వేలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోయాయి. దీంతో వందలాది కుటుంబాలు రోడ్డున పడ్డాయి. అదే వరద గోదావరి గత 50 ఏళ్లుగా వేలాది ఎకరాలను మెరక చేసింది.ఈ భూముల్లో పలువురు పట్టాలు గల రైతులు వివిధ పంటలు వేసి సాగు చేసుకుంటున్నారు. కొన్ని చోట్ల ప్రభుత్వం పేదలకు పట్టాలు పంపిణీ చేస్తుంది. వీటిని కూడా చిన్న చిన్న రైతులు పచ్చగడ్డి , కూరగాయలు వివిధ రకాల పంటలు పండిస్తూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం అక్రమార్కుల కన్ను గోదావరి లంక భూములపై పడింది. ఇష్టానుసారం తవ్వేస్తున్నారు. ఇటుకబట్టీలకు తరలించేస్తున్నారు. దీంతో వేలాది ఎకరాలు మాయమవుతున్నాయి. పట్టాలు పొందిన రైతులు సహకరిస్తుండడంతో అక్రమ మట్టి తోలకందారులకు అడ్డుఅదుపు లేకుండా పోతోంది. రెండు యూనిట్లు లారీ రూ.3 వేలు నుంచి రూ. 4 వేలకు విక్రయిస్తున్నారు. గోదావరి పొడవునా రాత్రి పగలు తేడా లేకుండా వందలాది లారీల మట్టి తరలించుకుపోతూ అక్రమార్కులు కోట్లలో సొమ్ములు కూడబెడు తున్నారు. ఆ భూములు కలిగి ఉన్న రైతులకు మాత్రం తృణమో పణమో అప్పజెప్పి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ పట్టాలు కలిగి ఉన్న రైతులు ఆ మట్టి తీసిన భూముల్లో ఏమి పండక పైకి కిందకి చూస్తున్నారు. ఈ విధంగా కాకుండా తమకు పట్టాలిచ్చిన భూముల్లో వివిధ రకాలు పంటలు సాగు చేసి కుటుంబానికి తగ్గ ఆదా యం పొందవచ్చునని పలువురు రైతులు నిరూపిస్తున్నారు.

సాగు..బాగున్నా...

పెరవలి మండలం తీపర్రులో వందలాది ఎకరాలు నదీ గర్భంలో కలిసిపోయింది. అయినప్పటికి గత 30 ఏళ్లలో మళ్లీ మట్టి మెరక వేసి ఎవరి భూములు వారికి సాగులోకి వచ్చాయి. దీంతో ఆనందపడిన రైతులు భూములు సరిచేసుకుని స్వల్పకాలిక పంటలు పండిస్తూ మెరక భూములతో సమానంగా ఆదాయం పొందు తున్నారు. జూన్ నెలలో గోదావరి వరదలు వచ్చే సమయానికి ఆ భూములు ఖాళీ చేసి నవంబరు వరకు వదిలివేస్తారు. వరద తగ్గిన అనంతరం ఆ భూముల్లో మినుము, పెసర వంటి స్వల్ప కాలిక పంటలు వేస్తారు. మూడు నెలలో అవి కోసిన అనంతరం మళ్లీ మొక్కజొన్న పంట వేస్తారు. అదికూడా 4 నెలల్లో కోతకు వచ్చి గోదావరి వరదలు వచ్చే నాటికి రైతుకు ఎటువంటి నష్టం లేకుండా ఉంటుంది. ఈ విధానంతో రైతులకు అన్ని ఖర్చులు పోనూ ఎకరానికి రూ.50 వేల వరకు మిగులుతుంది. గోదారమ్మ ఒడిలో శ్రమకు తగ్గ ఫలితం లభిస్తుండడంతో పలువురు రైతులు ఆసక్తి కనబరుస్తున్నారు. ప్రభుత్వం ఆటువంటి రైతులను పోత్సహిస్తే లంకల్లో నిరూపయోగంగా ఉన్న వందలాది ఎకరాలు సాగులోకి వస్తాయి.

రైతులకే పట్టాలివ్వాలి..

వరదొస్తే కొన్ని చోట్ల భూమి కోతకు గురవుతుంది. అదే వరద ప్రభావంతో మరికొన్ని చోట్ల ఇసుక మేటలు వేస్తుంది.అంతే కాకుండా మరికొన్ని చోట్ల మెత్తని సారవంతమైన మట్టిని మేటలు వేస్తుంది. గోదావరి వరద వల్ల ఎంత నష్టం సంభవిస్తుందో అంతకు మించి లాభాలు ఉంటాయి. అయితే స్వార్థపరులైనకొంత మంది ఇసుక మేటలను కొల్లగొట్టడమే కాకుండా సారవంతమైన మట్టిని తవ్వుకుపోతున్నారు.ప్రస్తుతం పెరవలి మండలంలో సమారు 10 గ్రామాల్లో గోదావరి పరీవాహక ప్రాంతం ఉంది.. ఖండవల్లి, మల్లేశ్వరం, కాకరపర్రు తదితర ప్రాంతాల్లో ఉన్న లంకల్లో ఉన్న మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు. పెరవలిలో మండలంలో మట్టికి చాలా డిమాండ్ ఉంటుంది. ఎందుకంటే ఇటుకబట్టీలన్నీ అక్కడే ఉంటాయి.గోదావరి మట్టిని అయా బట్టీలకు తరలించేస్తున్నట్టు సమాచారం. కొవ్వూరు మండలం చిడిపిలోనూ ఇదే పరిస్థితి ఉంది.తాళ్లపూడి మండలం బల్లిపాడులోనూ యథేచ్ఛగా మట్టిని తరలించేస్తున్నారు. ఇక్కడి నుంచి మట్టిని గోపాలపురంలోని ఇటుక బట్టీలకు తరలించేస్తున్నారు. ప్రభుత్వం ద్వారా పట్టాలు పొంది సల్పకాలిక ప్రయోజనం కోసం ఆ భూముల్లో మట్టి అమ్ముకుంటున్న రైతులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. అటువంటి వారి భూములు స్వాధీనం చేసుకుని పం టలు పండించుకునే రైతులకు ఇవ్వాలని కోరుతున్నారు. మెరక ప్రాంతంలో భూములు ధరలు ఆకాశాన్ని అంటి ఎకరం రూ. 40 లక్షల నుంచి రూ.కోటి వరకు పలుకుతుండడంతో ఆసక్తి గల రైతులు వాటిని సాగు చేయకుండా లంక పొంతాల్లోని భూములుపై మొగ్గు చూపుతున్నారు. దీనిపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ కనబరచి వ్యవసాయం పట్ల మొగ్గు చూపే రైతులకు ఆ భూములు ఇవ్వాలని గోదావరి పరీవాహక రైతాంగం కోరుతున్నారు.

సాగు చేసుకుంటేనే బాగు



సుమారు 40 ఏళ్ల కిందట 10 ఎకరాలు గోదావరిలో కలిసిపోయింది. కొంత కాలానికి 3 ఎకరాలు మెరవ వేసింది. దానిని సాగులో తెచ్చా. పదేళ్లగా పంటలు పండిస్తున్నా.. గుమ్మడి, మినుము, మొక్కజొన్న వంటి స్వల్పకాలిక రకాలు సాగు చేస్తున్నా.. ఎకరాకు రూ.40 వేల వరకూ ఆదాయం వస్తుంది. లంకభూములు మట్టి తవ్వకానికి ఎందుకు అమ్ముతున్నారో అర్థం కావడంలేదు.

- కరుటూరి శ్రీనివాసరావు, రైతు, తీపర్రు


తీపర్రు లంక భూముల్లో కళకళలాడుతున్న చేను

మార్చి 1 నుంచి జగనన్న పాలవెల్లువ

రాజమహేంద్రవరం సిటీ/రూరల్ ఫిబ్రవరి 9: జగనన్న పాల వెల్లువ పథకంలో పాల సేకరణ కార్యక్రమం వచ్చేనెల 1 నుంచి ప్రారంభమౌతుందని జేసీ తేజ్ భరత్ అన్నారు. రాజమహేంద్రవరం రూరల్ మండలం హుకుంపేట గ్రామసచివాయలం-1లో పాలసేకరణపై గ్రామ సచివాలయ వలంటీర్లకు శుక్రవారం జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సేకరించిన పాలకు వెన్నశాతం, చిక్కదనం ఆధారంగా ధర చెల్లింపులు చేస్తామని తెలిపారు. జిల్లాలో చేయూత ,ఆసరా కింద ప్రయోజనం కలిగిన రైతులను గుర్తించి వారి వివరాలు జేవీపీ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. సమావేశంలో రూరల్ ఎంపిడీవో డి.శ్రీనివాసరావు, మండల వెటర్నరీ డాక్టర్ సౌమ్య , వలంటీర్లు ,సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం, బియ్యం నిల్వ వివరాలు నమోదు చేయాలి

రాజమహేంద్రవరం రూరల్ ,ఫిబ్రవరి 9: ప్రభుత్వ నిర్ధేశాల ప్రకారం జిల్లా వ్యాపారులు, మిల్లర్ల వద్ద ఉన్న బియ్యం, ధాన్యము నిల్వల వివరాలు సంబంధిత పోర్టల్‌లో వారంరోజులలోగా నమోదు చేయాలని జేసీ తేజ్ భరత్ ఆదేశించారు.కలెక్టరేట్‌లో ట్రేడర్సు, హోల్‌సేలర్స్ , రిటైలర్స్ ,బిగ్ చైన్ రిటైలర్లు ,మిల్లర్లుతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. కేంద్ర , రాష్ట్ర ప్రభుత్వాలు నిర్ధేశించిన మేరకు ఈ ప్రక్రియ చేపట్టాలన్నారు. హెచ్‌టిటిపి://ఈవిఈజీఓఐఎల్ఎస్.ఎన్ఐసి. ఇన్/రైస్/లాగిన్ .హెచ్‌టిఎమ్ఎల్ నందు ఏడు రోజులలోపు తప్పక నమోదు చేయాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పౌరసరఫరాల అధికారి పి విజయభాస్కర్, రైస్ మిల్లర్ల ప్రతినిధులు సిహెచ్ బ్రహ్మజీ, ఎబీఎస్ ప్రసాద్, కె సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

16న బంద్ విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9 : ప్రధాని మోదీ విధానాలు దేశ ప్రజలకు ప్రమాదకరమని పలు కార్మిక సంఘాల నాయకులు అన్నారు. ఫిబ్రవరి 16న కేంద్ర కార్మిక సంఘాలు, రైతు సంఘాలు,వ్యవసాయ కార్మిక సంఘాలు, రైతు కూలీ సంఘాల ఆధ్వర్యంలో జరిగే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని కోరారు. రాజమహేంద్రవరం శ్యామలాసెంటర్‌లోని సీఐటీయూ కార్యాలయంలో శుక్రవారం వివిధ కార్మిక సంఘాల సమావేశంలో సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ మాట్లాడారు.మోదీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్పొరేట్, మతోన్మాద విధానాలు రైతుల పాలిట ఉరితాడులుగా మారాయన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కె.రాంబాబు, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకులు కె.జోజి, టీఎన్‌టీయూసీ యర్రమోతు ధర్మరాజు, ఏఐటీయూసీ, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు కొండలరావు, ఎస్ఎస్ మూర్తి పాల్గొన్నారు.

డబ్బు ఆశ చూపి వ్యభిచార రొంపిలోకి..

» బాలికపై లైంగికదాడి.. ఇద్దరు వీఆర్వోలపై పోక్సో కేసు

» మరో ముగ్గురిపైనా.. నిడదవోలులో ఘటన

నిడదవోలు, ఫిబ్రవరి 9: డబ్బులిస్తామని చెప్పి ఇద్దరు వీఆర్వోలు ఓ బాలికను శారీరకంగా అనుభవించిన ఘటనపై పోక్సో చట్టం కింద శుక్రవారం కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. విజయనగరం జిల్లాకు చెందిన బాలిక(14) తూర్పుగోదావరి జిల్లా నిడదవోలులో తెలిసిన వారింటికి వచ్చింది. ఆ బాలికకు డబ్బులు ఆశ చూపి నిడదవోలుకు చెందిన షేక్ అఖిలాండేశ్వరి, బండారి లలిత, దాడిశెట్టి దుర్గారావు అనేవారు వ్యభిచార కూపంలోకి దింపారు. ఈ క్రమంలో నిడదవోలు మండలంలో గ్రామ రెవెన్యూ అధికారులుగా పనిచేస్తున్న పార్ల వెంకట్రావు, ఇంజేటి చిట్టిబాబుల వద్దకు గురువారం రాత్రి దుర్గారావు బేరం మాట్లాడి బాలికను పంపాడు. ఆ బాలికను వారిద్దరూ గురువారం రాత్రి శారీరకంగా అనుభవించారు. తర్వాత బాలికను స్థానిక గణేష్‌చౌక్ సెంటర్‌లో దింపేందుకు వీఆర్వో చిట్టిబాబు వెళ్లాడు. అక్కడ ముందుగా మాట్లాడుకున్న మేరకు డబ్బులు ఇవ్వకపోవడంతో వీఆర్వో చిట్టిబాబుపై దుర్గారావు, మరికొంతమంది దాడిచేసి విచక్షణారహితంగా కొట్టారు. ఈ విషయం పోలీసుల దృష్టికి వెళ్లడంతో బాలిక ఫిర్యాదు మేరకు ఆమెను వ్యభిచార కూపంలోకి దింపిన ముగ్గురు దళారులతో పాటు, అత్యాచారం చేసిన ఇద్దరు వీఆర్వోలపై పోలీసులు పోక్సో తదితర చట్టాల కింద కేసులు నమోదు చేశారు. అలాగే తమపై దాడిచేసి, డబ్బు లాక్కొని.. కులం పేరిట దూషించారంటూ వీఆర్వో చిట్టిబాబు ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. దుర్గారావుతోపాటు మరికొంతమందిపైనా కేసులు నమోదైనట్టు నిడదవోలు ఎస్‌ఐ ఫులపా అప్పారావు తెలిపారు.

బడ్జెట్‌లో పన్నుల బాదుడు తప్ప కొత్తవేమీ లేవు

టీడీపీ కొవ్వూరు నియోజకవర్గ ద్విసభ్య కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ, సుబ్బరాయచౌదరి

కొవ్వూరు, ఫిబ్రవరి 9: పన్నుల బాదుడు తప్ప రాష్ట్ర బడ్జెట్‌లో కొత్త అంశాలు ఏమి లేవని టీడీపీ నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమణి రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి విమర్శించారు. శుక్రవారం కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్ర రెవెన్యూ లోటును రూ.13 వేల కోట్ల నుంచి రూ.44వేల కోట్లకు, రూ.35 వేల కోట్ల ద్రవ్యలోటును రూ.60 వేల కోట్లకు పెంచిన ఘనత బుగ్గనదేనన్నారు. జగన్ అండ్ కో రాష్ట్రాన్ని అప్పుల ఆంధ్రప్రదేశ్‌గా మార్చేశారన్నారు. వైసిపి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రతి పథకం ఓ స్కామ్ అన్నారు. బీసీ సబ్‌ప్లాన్ నిధులు రూ.75 వేల కోట్లు దారి మళ్లించారు. 30 పథకాలు రద్దు చేశారన్నారు. సమావేశంలో గొర్రెల శ్రీధర్, మాదిరెడ్డి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

పెరవలిలో వైఎస్‌ఆర్ ఆసరా పంపిణీ



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జీఎస్ నాయుడు

పెరవలి, ఫిబ్రవరి 9: డ్వాక్రా సంఘాల మహిళలను ఆదుకోవడానికే సీఎం జగన్ డ్వాక్రా రుణాల మాఫీ పథకాన్ని ప్రవేశపెట్టారని దీనిని వైఎస్ఆర్ ఆసరా పేరుతో డ్వాక్రా సంఘాలకు అందజేసినట్టు ఎమ్మెల్యే జి.శ్రీనివాసనాయుడు చెప్పారు. పెరవలిలో వైఎస్ఆర్ ఆసరా నాలుగో విడత లబ్ధిదారులకు నగదు పంపిణీ కార్యక్రమానికి ఆయన విచ్చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో రూ.46.40 కోట్లు కేటాయించారని, పెరవలి మండలానికి రూ.18.64 కోట్లు డ్వాక్రా సంఘాలకు అందజేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ కార్చెర్ల ప్రసాద్, జడ్పీటీసీ కొమ్మిశెట్టి రామాంజని, పలు గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులు పాల్గొన్నారు.

జనసైనికుడి కుటుంబానికి ఆర్థికసాయం

కొవ్వూరు, ఫిబ్రవరి 9: కార్యకర్తలకు జనసేన పార్టీ అండగా ఉంటుందని కొవ్వూరు నియోజకవర్గ ఇన్‌చార్జి టీవీ రామారావు అన్నారు. మండలంలోని సీతంపేటకు చెందిన జనసైనికుడు సంగీత కామేశ్వరరావు మార్చి 23న ప్రమాదవశాత్తూ మృతి చెందారు. ఆయనకు పార్టీలో క్రియాశీలక సభ్యత్వం ఉండడంతో జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ బాధిత కుటుంబానికి పార్టీ తరపున రూ.5 లక్షలు ఆర్థికసాయం అందజేశారు. శుక్రవారం కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో రామారావు రూ.5 లక్షల చెక్కును కామేశ్వరరావు కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సుంకర సత్తిబాబు, మాసిరెడ్డి రాధాకృష్ణ, పూటి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కుష్ఠు బాధితులకు దుస్తుల పంపిణీ

నిడదవోలు, ఫిబ్రవరి 9: స్పర్శ కుష్ఠు నివారణ పక్షోత్సవాల్లో భాగంగా నిడదవోలులోని మోషే లెప్రసీ కాలనీలో కుష్ఠు బాధితులకు శుక్రవారం దుప్పట్లు, టవల్స్ పండ్లు, హెల్త్ కేర్ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ ప్రసన్నకుమార్, ఎం.మోలు, ఎం.డేవిడ్, ఎ.వీర్రాజు పాల్గొన్నారు.

కాపుల సంక్షేమానికి పని చేసే పార్టీని గెలిపిద్దాం

తెలగ, బలిజ, కాపు జేఏసీ రాష్ట్రాధ్యక్షుడు దాసరి రాము



నల్లజర్లలో కాపు నాయకులతో దాసరి రాము

నల్లజర్ల, ఫిబ్రవరి 9: కాపుల సంక్షేమానికి పనిచేసే పార్టీని రాబోయే ఎన్నికల్లో గెలిపించాలని తెలగ, బలిజ, కాపు జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి రాము అన్నారు. శుక్రవారం నల్లజర్లలోని ఉన్నమట్ల కాంప్లెక్స్‌లో కాపు సంక్షేమ సేవ సంఘం ఉపాధ్యక్షుడు ఉన్నమట్ల వెంకటేశ్వరావు ఆధ్వర్యంలో కాపు, జనసేన నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ నిజాయితీ గల నాయకుడని, రాబోయే ఎన్నికల్లో జనసేన-టీడీపీని గెలిపించాలని అన్నారు. కార్యక్రమంలో ఉన్నమట్ల రామకృష్ణ, చోడసాని బాపిరాజు, ఉన్నమట్ల సత్య, రుద్ర శ్రీను, వరుణ్, అన్నవరం పాల్గొన్నారు.

పీవీకి 'భారతరత్న'పై హర్షం

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 9: కేంద్ర ప్రభుత్వం మాజీ ప్రధాని పీవీ నరసింహారావుకు భారతరత్న ప్రకటించడం పట్ల బ్రాహ్మణ మిత్ర సేవా సంఘం శుక్రవారం హర్షం వ్యక్తం చేసింది. బహు భాషా కోవిదుడు పీవీ దేశానికి చేసిన సేవలు మరువలేనివని పలువురు అన్నారు. సేవా సంఘం అధ్యక్షుడు దోనేపూడి సుధాకర్, సత్యకృష్ణ, ఆకెళ్ల శ్రీనివాసరావు, కె.గోపాలకృష్ణమూర్తి, కె.సత్యనారాయణ, దోనేపూడి శ్రీరామ్ హర్షం వ్యక్తం చేశారు.

ఎస్‌ఈబీ దాడుల్లో ఇద్దరి అరెస్టు

దేవరపల్లి, ఫిబ్రవరి 9: దేవరపల్లి ఎస్‌ఈబీ స్టేషన్ పరిధిలో శుక్రవారం దాడులు నిర్వహించి గోపాలపురం మండలం కొవ్వూరుపాడు గ్రామానికి చెందిన బెజవాడ ఆదిలక్ష్మిని అరెస్టు చేసి 10 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు సీఐ కేవీ స్వామి తెలిపారు. అలాగే దేవరపల్లి మండలం ధూమంతనగూడెం గ్రామానికి చెందిన ఆకుల సురేష్‌ను అరెస్టు చేసి 40 మద్యం సీసాలు, 3 బీరుసీసాలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఆరుగురు పాత నిందితులను దేవరపల్లి తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్టు చెప్పారు. దాడుల్లో ఎస్‌ఐ పి.సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాద బాధితుడికి ఆర్థిక సాయం

గోపాలపురం, ఫిబ్రవరి 9: ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన చిడిపి సుబ్బారావుకు మండల రక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయాన్ని సంఘ సభ్యులు శుక్రవారం అందించారు. రెండు నెలల క్రితం ప్రమాదంలో కాలు విరిగిపోవడంతో మంచానికే పరిమితమైన సుబ్బారావుకు రెండుసార్లు ఆర్థిక సాయంతో పాటు నిత్యావసర సరుకులు అందించామన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గెల్లా ఎలిషా, షాలేమ్, శ్యామ్‌బాబు, దాసరి రామారావు తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్ర బయో సమ్మిట్‌లో 'ఆర్ట్స్' విద్యార్థులు

రాజమహేంద్రవరం అర్బన్, ఫిబ్రవరి 9: విశాఖపట్నంలో ఈ నెల 5, 6, 7 తేదీల్లో జరిగిన ఆంధ్ర బయోసమ్మిట్- 2024లో తమ కళాశాల బయోటెక్నాలజీ విభాగం విద్యార్థులు పాల్గొన్నారని రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ కె.రామచంద్రరావు తెలిపారు. 12 మంది బీఎస్సీ బయోటెక్నాలజీ ఫైనలియర్ విద్యార్థులు ఈ సమ్మిట్‌లో పాల్గొని అనేక విషయాలు నేర్చుకున్నారని, పరిశోధనల పట్ల ఆసక్తి పెంచుకోవడంతో పాటు పరిశోధనా రంగంలోని అవకాశాలను తెలుసుకున్నారన్నారు. బయోటెక్నాలజీ విభాగాధిపతి బి.నాగేశ్వరిని అభినందించారు.

ఆశాల నిర్బంధం దారుణం

» ఆశావర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు జువ్వల రాంబాబు

» ప్రభుత్వ తీరును వ్యతిరేకిస్తూ నిరసన కార్యక్రమాలు



నిడదవోలులో ధర్నా నిర్వహిస్తున్న ఆశా కార్యకర్తలు

నిడదవోలు, ఫిబ్రవరి 9: రాష్ట్ర వ్యాప్తంగా ఆశా కార్యకర్తల న్యాయమైన డిమాండ్ల కోసం చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టగా ప్రభుత్వం పోలీసుల ద్వారా ఆశాలను నిర్బంధించడం దారుణమని యూనియన్ గౌరవాధ్యక్షుడు, సీపీఎం నాయకుడు జువ్వల రాంబాబు అన్నారు. గురువారం చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన అక్రమ అరెస్టులు, నిర్బంధాలను వ్యతిరేకిస్తూ శుక్రవారం వారు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా నిడదవోలులో ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. రాంబాబు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తోందని అన్నారు. ఆశావర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి ధనలక్ష్మి, మిగతా నాయకులను తక్షణం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హైమావతి, నాగలక్ష్మి, బేబీ, హేమలత, జ్యోతి, దేవి, దుర్గాదేవి పాల్గొన్నారు.

తాళ్లపూడి: మండలంలోని మలకపల్లి, తాళ్లపూడి పీహెచ్‌సీల వద్ద ఆశావర్కర్లు నిరసనలు తెలిపారు. నిర్బంధించిన వారిని ఇంకనూ ఇళ్లకు పంపలేదని, గృహ నిర్బంధం చేసిన తమ నాయకులను కూడా బయటకు వదలడం లేదని, ఇది అమానుష చర్య అని విమర్శించారు. తమని ప్రభుత్వ ఉద్యోగస్తులుగా పరిగణించి జీతాలు పెంచలేదని, సంక్షేమ పథకాలు ఇవ్వడంలేదని, చనిపోయిన ఆశావర్కర్లకు ఎక్స్‌గ్రేషియా కూడా ఇవ్వడంలేదని వాపోయారు. కనీస వేతనం రూ.26 వేల జీతం ఇవ్వాలనే తమ ప్రధాన డిమాండ్‌ను అసెంబ్లీ సమావేశాలకు ముందే తమ నాయకులను పిలిచి చర్చలు జరుపుతామని చెప్పి మోసగించారని అందుకే సమ్మెకు దిగామని, శుక్రవారం విధులు బహిష్కరించామని జిల్లా సంఘ సభ్యురాలు బేబీ కుమారి తెలిపారు. మండల స్థాయిలో శనివారం ధర్నా చేస్తామన్నారు. కార్యక్రమంలో సుధారాణి, కొండే సత్యవతి, వై.ఉషా రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని యాదవోలు పీహెచ్‌సీ వద్ద ఆశావర్కర్లు ఆందోళన చేపట్టారు. సీఐటీయూ నాయకులు మండల కార్యదర్శి ఎస్.భగత్, ఆశా వర్కర్ల యూనియన్ నాయకురాలు బుజ్జమ్మ మాట్లాడుతూ ఆశావర్కర్ల పట్ల ప్రభుత్వం నిరంకుశంగా వ్యవహరిస్తోందని రాబోయే ఎన్నికల్లో తగిన గుణ పాఠం చెబుతామన్నారు. న్యాయమైన డిమాండ్ల సాధనకు శాంతియుతంగా నిరసన తెలుపుతుంటే ఉద్యమాన్ని అణచివేయాలని ప్రభుత్వం చూస్తోందన్నారు. కార్యక్రమంలో టి.భారతి, అనిశెట్టి దాక్షయిని, పాల్గొన్నారు.





దేవరపల్లి: యాదవోలు పీహెచ్‌సీ వద్ద ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



తాళ్లపూడి మండం మలకపల్లి, అనపర్తిలో ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

గోపాలపురం: చలో విజయవాడ కార్యక్రమాన్ని ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకుని భగ్నం చేయడాన్ని నిరసిస్తూ ఆశాకార్యకర్తలు శుక్రవారం నులిపురుగుల మాత్రల పంపిణీ కార్యక్రమాన్ని బహిష్కరించారు. అందులో భాగంగా హుకుంపేట, అన్నదేవరపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వద్దకు చేరుకుని నిరసన వ్యక్తంచేశారు. యూనియన్ అధ్యక్షురాలు మేరీ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో అమలు చేయలేని హామీలిచ్చి ఐదేళ్లలో అమలు చేయకపోగా, వాటిని అమలు చేయమని అడిగిన ఆశా కార్యకర్తలపై పోలీసులు వ్యవహరించిన తీరు భారతంలో దుశ్శాసన పర్వాన్ని తలపించిందన్నారు. మహిళలని చూడకుండా ఎక్కడికక్కడ నిర్బంధించారన్నారు.

గోకవరం: గోకవరంలో పంచాయతీ కార్యాలయం నుంచి ప్రదర్శనగా బయలుదేరి తహశీల్దార్ కార్యాలయానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ సెలవులు, మెడికల్ వేతనంతో కూడిన మెటర్నిటీ లీవ్ అమలు చేయాలని, సంబంధంలేని పనులు చేయించరాదని, నాణ్యమైన సెల్‌ఫోన్లు ఇవ్వాలని, ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని, ఖాళీ పోస్టులు భర్తీ చేయాలనే డిమాండ్లను నేరవేర్చాలని నినాదాలు చేశారు. ప్రభుత్వం తమ సమస్యల పట్ల సానుకూలంగా స్పందించకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

అనపర్తి: మండలంలోని రామవరం, కుతుకులూరు పీహెచ్‌సీల వద్ద ఆశావర్కర్లు ధర్నాలు నిర్వహించారు. యూనియన్ నాయకులు అనూష, రాజకుమారి మాట్లాడుతూ అక్రమ నిర్బంధాలతో తమ పోరాటాన్ని ఆపలేరని, డిమాండ్లు నెరవేర్చే వరకు నిరసన కొనసాగిస్తామని అన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారంలో విఫలం

» ప్రభుత్వంపై ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి విమర్శ

» హోం మంత్రి తక్షణ రాజీనామాకు డిమాండ్

» చాగల్లులో రచ్చబండ



రచ్చబండ కార్యక్రమంలో మాట్లాడుతున్న వైఎస్ షర్మిలారెడ్డి

చాగల్లు, ఫిబ్రవరి 9: ప్రజా సమస్యల పరిష్కారంలో వైసీపీ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఏపీ పీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలారెడ్డి విమర్శించారు. శుక్రవారం చాగల్లులో జరిగిన రచ్చబండ కార్యక్రమానికి ఆమె విచ్చేసి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దాశం స్వాతి సహా పలువురు మహిళలు మాట్లాడుతూ ఇళ్ల స్థలం లేదని, వైసీపీ నాయకులు వారికి కావలసిన వారికి మాత్రమే స్థలాలు ఇస్తున్నారని, అర్హులకు అన్యాయం చేస్తున్నారన్నారు. నిరుద్యోగి కార్తీక్ మాట్లాడుతూ జాబ్ కేలెండర్ అన్నారు కాని ఇంతవరకు నోటిఫికేషన్లు విడుదల కాకపోవడం వల్ల అర్హతకు సంబంధం లేని పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నామని ఆవేదన వ్యక్తం చేశాడు. రైతు సంఘం సభ్యులు జీవీ సుబ్బారావు, కంకటాల బుద్ధుడు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో స్థానిక షుగర్ ఫ్యాక్టరీని తిరిగి ప్రారంభిస్తాని, రైతులను, కార్మికులను ఆదుకుంటామని హామీ ఇచ్చిన సీఎం జగన్, స్థానిక ప్రజా ప్రతినిధులు ఎటువంటి చర్యలు తీసుకోలేదన్నారు. ఫ్యాక్టరీని తెరిపించాలని, కౌలు రైతుల సమస్యలు పరిష్కరించాలని, పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరారు. రాళ్లముడుగు కాలువ వంతెనను వెడల్పు చేయాలని, కాలువ పూడిక తీయాలని కోరారు. వైసీపీ ప్రభుత్వంలో రైతు పథకాల తీరు.. నిబంధనలు ఎక్కువ, ప్రయోజనాలు తక్కువ అన్నట్టుగా ఉందన్నారు. లారీ అసోసియేషన్ తరుపున పంగిడికి చెందిన పెదకాపు, ఎం.నాని మాట్లాడుతూ జగన్ ప్రభుత్వం రావాలని ఎంతో చేశామని కాని ప్రభుత్వం ట్రాన్సుపోర్టు రంగంపై తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఐదు లారీలను నడిపేవాళ్లమని, ప్రస్తుతం ఒక్కలారీ కూడా నిర్వహించడం కష్టంగా ఉందన్నారు. లారీ యజమానులకు, డ్రైవర్లకు ప్రమాద బీమా, పెన్షన్ సౌకర్యం కల్పించాలని కోరారు. ప్రభుత్వం నుంచి రావలసిన బిల్లులు సకాలంలో రాకపోవడంతో అప్పుల పాలై ఇబ్బందులు పడుతున్నామన్నారు. దళిత సంఘం నాయకుడు చోళ్ల రాజు మాట్లాడుతూ దళితులను చంపి డోర్ డెలివరీ చేస్తున్న వారికి ఉన్నత పదవులు ఇచ్చి ప్రోత్సహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రశ్నించిన వారిపై కేసులు పెట్టి వేధిస్తున్నారన్నారు. దివ్యాంగుల సంఘం తరుపున కిరణ్‌కుమార్ మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం దివ్యాంగుల పింఛను సొమ్ము పెంచలేదని, వివిధ కారణాలు చూపిస్తూ రాష్ట్రంలో 96000 మంది పింఛన్లు తొలగించడం దారుణమన్నారు. వెంటనే వాటిని పునరుద్ధరించాలని కోరారు. ఈ సందర్భంగా షర్మిలారెడ్డి మాట్లాడుతూ దళితులపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండించారు. హోం మంత్రి సొంత నియోజకవర్గంలో జరుగుతున్న దాడులను ఆపలేని మంత్రి తక్షణమే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దివ్యాంగుల పింఛన్లు పెంచాలని, రద్దు చేసిన వాటిని పునరుద్ధరించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి, ఉభయ గోదావరి జిల్లాల పర్యవేక్షకురాలు సుంకర పద్మశ్రీ, మండలాధ్యక్షుడు బి.రాంబాబు, ఎం.సత్యనారాయణ, పి.మురళీకృష్ణ, ఎండీ అమర్‌జహ బేగ్, ఎండీ రఫీయుల్లా బేగ్, గెల్లా భాస్కరరావు, మట్టా సుబ్బారావు పాల్గొన్నారు.



రైతు సమస్యలను షర్మిలరెడ్డికి వివరిస్తున్న రైతు సంఘం నాయకులు

97 శాతం మందికి ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ

» ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రసాద్

» జాతీయ నులిపురుగుల నివారణా దినం



తాళ్లపూడి: పెద్దేవంలో విద్యార్థినికి ఆల్బెండజోల్ మాత్రలు వేస్తున్న ఎమ్మెల్యే తలారి

ఉండ్రాజవరం, ఫిబ్రవరి 9: మండలంలో 97శాతం మంది పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు వేసినట్టు ఉండ్రాజవరం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ఆర్ఎస్ ప్రసాద్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణా దినం సందర్భంగా శుక్రవారం పలు పీహెచ్‌సీల పరిధిలోని పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. ఉండ్రాజవరం మండలంలో 7847 మంది పిల్లలకు గాను 8079 మంది పిల్లలకు మాత్రలు వేసినట్టు తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలందరికి మాత్రలు వేసినట్టు వివరించారు. సీహెచ్‌వో ఎం.సుబ్రహ్మణ్యం, ఆరోగ్య సిబ్బంది పర్యవేక్షించారు.

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవం గ్రామ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే తలారి వెంకట్రావు విద్యార్థులకు మాత్రలు అందించారు. అనంతరం గ్రామంలో పంచాయతీ నిధులతో చేపట్టిన డ్రైనేజీ, కల్వర్టు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తిగిరిపల్లి వెంకట్రావు, ఉప సర్పంచ్ తోట రామకృష్ణ, ఎంపీపీ జొన్నకూటి పోసిరాజు, జడ్పీ వైస్ చైర్మన్ పోసిన శ్రీలేఖ తదితరులు పాల్గొన్నారు.

చాగల్లు: చాగల్లు, కలవలపల్లి పీహెచ్‌సీల పరిధిలోని పాఠశాలలు, కళాశాలల్లోను విద్యార్థులకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో డాక్టర్లు కె.నిశిత, పీఆర్ఎల్ దేవి వై.తనూజ తదితరులు పాల్గొన్నారు.

దేవరపల్లి: మండలంలోని గౌరీపట్నం పీహెచ్‌సీ పరిధిలో 963 మంది, దేవరపల్లి పీహెచ్‌సీ పరిధిలో 6726 మంది, యాదవోలు పీహెచ్‌సీ పరిధిలో 6200 మంది పిల్లలకు ఆల్‌బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్టు డాక్టర్లు జె.సతీష్, హరిచందన తెలిపారు. శుక్రవారం మాత్రలు వేయించుకోని పిల్లలకు ఈ నెల 16న వేయనున్నట్టు చెప్పారు. కార్యక్రమాల్లో గౌరీపట్నం సీహెచ్‌వో ఎ.కృష్ణుడు, దేవరపల్లి సీహెచ్‌వో సంజీవ్, యాదవోలు హెల్త్ సూపర్‌వైజర్ పద్మకుమారి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

గోపాలపురం: మండలంలోని హుకుంపేట పీహెచ్‌సీలో నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో 5398 మంది చిన్నారులకు గాను 5295(98శాతం) మందికి మాత్రలు వేసినట్టు వైద్యాధికారిని దుర్గాభవాని తెలిపారు. కార్యక్రమంలో వైద్యఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.



దేవరపల్లి: చిన్నాయిగూడెంలో పిల్లలకు మాత్రలు వేస్తున్న డాక్టర్ హరిచందన



గోపాలపురం: హుకుంపేటలో మాత్రలు డాక్టర్ దుర్గాభవాని

రహదారి భద్రతా నియమాలు పాటించాలి

వాహనదారులకు అవగాహన సదస్సులో ఎంవీఐ శ్రీనివాసనాయక్

కొవ్వూరు, ఫిబ్రవరి 9: రహదారి భద్రతా నియమాలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చునని మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ బి.స్వర్ణ శ్రీనివాసనాయక్ అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో భాగంగా కొవ్వూరు రోడ్డు కం రైలు బ్రిడ్జి వద్ద శుక్రవారం వాహనదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. హెల్మెట్, సీటు బెల్టు ధరించిన వాహనదారులకు గులాబీలు ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనాలు నడిపే సమయంలో జాగ్రత్తలు పాటించాలని, తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎంవీఐ ఎండీ జమీర్, సీనియర్ అసిస్టెంట్ బి.సుకుమార్, ఆపరేటర్ అరుణకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.



ద్విచక్ర వాహనదారుడికి గులాబీ అందిస్తున్న ఎంవీఐ శ్రీనివాస నాయక్

ఎస్పీలతో పీడీజే సమావేశం



సమావేశంలో పాల్గొన్న ఎస్పీ జగదీష్

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): మార్చి 9న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌ని పురస్కరించుకొని తూర్పు, కోనసీమ, కాకినాడ ఎస్పీలతో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత సమావేశమయ్యారు. వారి పరిధిలోని రాజీకి అర్హమైన కేసులను గుర్తించి ఆ జాబితాను న్యాయ సేవాధికార సంస్థకు అందజేయాలని ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఏపీపీలు జీఎస్‌వీ ప్రసాదరావు, జి.వెంకటరత్నం, ఎస్పీలు పి.జగదీశ్, ఎన్.శ్రీధర్, కాకినాడ జిల్లా అడిషనల్ ఎస్పీ ఎంజేవీ భాస్కరరావు, రంపచోడవరం అడిషనల్ ఎస్పీ ఏ.జగదీశ్ తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో ఎన్నికల విధులు నిర్వర్తించాలి

రాజమహేంద్రవరం మునిసిపల్ కమిషనర్ దినేష్‌కుమార్

రాజమహేంద్రవరం సిటీ, ఫిబ్రవరి 9: ఎన్నికల విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది అంకితభావంతో విధులు నిర్వహించాలని ఆర్‌వో, కమిషనర్ దినేష్‌కుమార్ ఆదేశించారు. రాజమహేంద్రవరం అర్బన్ నియోజకవర్గానికి సంబంధించి శ్రీవెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో శనివారం ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ కేంద్రాల నిర్వహణ, ఈవీఎంల వినియోగంపై సెక్టార్ అధికారులు, బీఎల్ వోలు,సిబ్బంది శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పోలింగ్ సమయంలో చివరి నిమిషంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సమస్యాత్మక పోలింగ్‌కేంద్రాల, పోస్టల్ బ్యాలెట్లపై మాస్టర్ ట్రైనర్ ఏవీ శ్రీనివాస్, ప్రిసెస్మెంట్లు రామనాగేశ్వరావు, వేణుమోహన్ కూలంకుషంగా వివరించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పీఎం.సత్యవేణి, ఈఈ మదర్సా అలీ, శేషగిరిరావు, తహశీల్దార్ కె.ఆంజనేయులు, మునిసిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ వినూత్న, సెక్రటరీ టి.సుధాకర్, మేనేజర్ ఎండి అబ్దుల్ మాలిక్ అస్పర్ తదితరులుపాల్గొన్నారు.

విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించాలి

గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం జిల్లా అధ్యక్షుడు రమణారావు



రంగంపేట, ఫిబ్రవరి 9: విద్యార్థులు కృషి, పట్టుదలతో చదివి ఉత్తమ ర్యాంకులు సాధించాలని గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘ జిల్లా అధ్యక్షుడు కేవీ రమణారావు సూచించారు. శుక్రవారం మండలంలోని చంద్రేడు జడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం గంటా రమణబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఆయన విచ్చేశారు. జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి అనంతరం మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విద్యా సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత విద్యను అభ్యసించాలని, పట్టుదలతో చదివి పదో తరగతిలో పదికి పది పాయింట్లు సాధించడానికి కృషి చేయాలన్నారు. డీవైఈవో ఈవీఎస్ఎస్ఎస్‌బీఎల్ నారాయణ ఆధ్వర్యంలో ప్యానల్ టీచర్స్ ఉపాధ్యాయుల విద్యాబోధను పరిశీలించారు. వ్యాయామోపాధ్యాయుడు బాపిరాజు ఆధ్వర్యంలో విద్యార్థులు చేసిన యోగాభ్యాసాలు, వివిధ విన్యాసాలను ఉపాధ్యాయులు తిలకించారు. కార్యక్రమంలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో నిందితుడికి రెండున్నరేళ్ల జైలు

రూ.2500 జరిమానా

రాజమహేంద్రవరం, ఫిబ్రవరి 9(ఆంధ్రజ్యోతి): పోక్సో కేసులోని నేరస్తుడికి రెండున్నరేళ్ల జైలు శిక్ష విధిస్తూ కోర్టు తీర్పు చెప్పింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. 2020 జూలై 26న ఓ బాలిక కిరాణా దుకాణానికి వెళ్లగా అదే సమయంలో అక్కడ ఉన్న బొమ్మూరుకు చెందిన కె.సుధీర్ కుమార్(సిద్దు) తన బైక్‌పైకి ఆ బాలికను బలవంతంగా లాగి అసభ్యంగా ప్రవర్తించాడు. బాలిక తల్లి ఫిర్యాదుతో బొమ్మూరు పీఎస్‌లోని అప్పటి ఎస్‌ఐ ఆర్.శివాజీ కేసు నమోదు చేశారు. కోర్టులో నేరం రుజువు కావడంతో జైలు శిక్షతో పాటు రూ.2500 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరపున పీపీ పితాని శ్రీనివాసరావు వాదనలు వినిపించారు. బొమ్మూరు సీఐ ఎండీ ఉమర్, అప్పటి ఎస్‌ఐ శివాజీ తదితరులను ఎస్పీ జగదీశ్ అభినందించారు.